జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 15 సంచిక 199 విశాఖపట్నం | సోమవారం 20 మార్చి 2023 | 8 పేజీలు | వెల : 5.00



## పేదరికంలో నుంచి బయటపడాలంటే...

# చదువే ఏకైక మార్గం

### జగనన్న విద్యా దీవెన కింద రూ.698.68 కోట్లు విడుదల





తిరువూరు, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించటమే వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జరగిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒక మనిషి పేదరికంలో నుంచి బయటపడాలంటే చదువే ఏకైక మార్గమని అన్నారు. దేశంలో ఎక్కడా లేవని ప్రభుత్వ స్కూళ్ళలో చదివే విద్యార్థులక తప్ప ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సాయం అందించటం లేదని అన్నారు.కాలేజి ఫీజులు ఎంతైనా సరే పూర్తి బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్ లో ఉంచి బకాయిలు పెట్టేవారిని, దీంతో ప్రైవేటు యాజమాన్యాలు పెట్టే ఒత్తిడి భరించలేక అనేక మంది విద్యార్థులు మధ్యలో చదువు మానివేసేవారని అన్నారు. పిల్లలకు చదువు చెప్పించలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలున్నాయని వివరించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్తాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా రూ.698.68 కోట్ల నిధులను 8,83,723 మంది తల్లుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ నిధుల విడుదలతో 9,86,001 మంది లబ్దిదారులు లబ్దిపొందినట్లు ఆయన తెలిపారు.

**ఎల్లో మీడియాకు, కుట్ర రాజకీయాలకు భయపడేది లేదు..**

పేదలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై దుష్టచతుష్టయంలో ఉన్న తోడేళ్ళన్ని ఏకమై ముప్పేటదాడికి తయారువుతున్నాయని, ఇవన్నీ కలిసినా తననేం చేయలేవని ముఖ్యమంత్రి అన్నారు. విలువలులేని దుష్టచతుష్టయంతో యుద్ధం చేస్తున్నానని అన్నారు. రాజకీయాల్లో కనీసం అర్హత లేని వారు కూడా ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని దోచుకుతినటానికి పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని ఆయన నిప్పులు చెరిగారు. పేదల కోసం పనిచేస్తున్న మీ బిడ్డకు నమ్మకం, ధైర్యం అండ అన్నీ ప్రజలేనని అన్నారు. ఎల్లో మీడియాకో, కుట్ర రాజకీయాలకు తాను భయపడేదిలేదని అన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో పెత్తందారుల దోచుకుతిన్నారని ఆయన విమర్శించారు. జగనన్న విద్యా దీవెన కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా 9.86 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.698.68 కోట్లు జమ చేశారు. గత ప్రభుత్వం అరకొరగా ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు 2017 నుండి పెట్టిన బకాయిలు రూ.1,778 కోట్లతో కలిపి ఇప్పటి వరకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన కింద ప్రభుత్వం రూ.13,311 కోట్లు సాయంగా అందించింది.

(మిగతా 2లో..)

# ఇది ప్రజా విజయం..

### జగన్ మళ్లీ గెలిచే పరిస్థితి లేదు: చంద్రబాబు



అమరావతి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం గెలుపు ప్రజా విజయమని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. ఈ ప్రజా తీర్పును జగన్ సర్కార్‌పై తిరుగుబాటుగా చూడాలన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇన్నేళ్లు రాష్ట్రం ఏం నష్టపోయిందో ప్రజలు గమనించారని.. చైతన్యం, బాధ్యతతో వచ్చి ఓట్లేశారన్నారు. నాలుగేళ్లలో జగన్ విధ్వంస పాలన కొనసాగించారని చంద్రబాబు విమర్శించారు."జగన్ బాధ్యత లేని వ్యక్తి మోసాలు చేయడంలో దిట్ట. ఆయనది ధనబలం.. రౌడీయిజం.. అవి ఎప్పటికీ శాశ్వతం కాదు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ గెలిచే పరిస్థితి లేదు. ఉగాది పంచాంగాన్ని ప్రజలు రెండు రోజుల ముందే చెప్పారు. జగన్ అక్రమాలను నమ్మి వాటితోనే ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్ని అవకతవకలకు పాల్పడాలో అన్నీ చేశారు. ప్రతిపక్ష పార్టీల నేతలు మాట్లాడితే కేసులు పెట్టించి వేధించారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనూ తిరుగుబాటు ప్రారంభమైంది. నేరాల్లో అధికారులను భాగస్వామ్యం చేస్తున్నారు. వైకాపా పాలనలో కార్యనిర్వాహక వ్యవస్థ నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొంది. సీఎస్ సహా అధికారులను కోర్టులు చీవాట్లు పెట్టే పరిస్థితి వచ్చింది. శాసనసభ, మండలిని ప్రహసనంగా మార్చారు. కోర్టులు, జడ్జిలను బ్లాక్ మెయిల్ చేసేవిధంగా ప్రవర్తించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారు. ఐదో తరగతి చదివిన వ్యక్తికీ ఓటు హక్కు కల్పించారు. ఓటుకు రూ.10వేలు, వెండి నగలు ఇచ్చి మభ్యపెట్టారు. టిడిపి ప్రచారం నిర్వహించకుండా అడ్డంకులు సఅష్టించారు. ఎన్నికల్లో దొంగ ఓట్లు నివారించడం పెద్ద సమస్యగా మారింది. కౌంటింగ్‌లో హాలులోనూ అడుగడుగునా అడ్డంకులు సఅష్టించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పులివెందుల నుంచి మనుషులను పంపారు. పోరాడి చివరకు టిడిపి అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించినా డిక్లరేషన్ ఇవ్వలేదు. రీకౌంటింగ్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఓటమిని అంగీకరించలేని పరిస్థితి వైసిపిది. మీ పని అయిపోయింది.. ఇకపై మీ ఆటలు సాగవు" అని చంద్రబాబు అన్నారు.

## రాహుల్‌గాంధీ ఎందుకు క్షమాపణ చెప్పాలి..

**మోదీ సర్కారుకు సంజయ్ రౌత్ సూటి ప్రశ్న**




ముంబై: లండన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో దేశాన్ని తక్కువచేసి మాట్లాడినందుకు రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని అధికార కూటమి పట్టుబట్టడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. అదానీ అక్రమాలపై జేపీసీ వేయాలన్న తమ డిమాండ్‌ను పట్టించుకోకుండా రాహుల్‌గాంధీ ప్రసంగం పేరుతో ప్రభుత్వం ఎదురు దాడి చేస్తున్నదని విమర్శిస్తున్నాయి. తాజాగా ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన ఎంపీ సంజయ్ రౌత్ కూడా ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పరని, అయినా ఆయన ఎందుకు క్షమాపణ చెప్పాలని సంజయ్ రౌత్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రతి చిన్న విషయానికి క్షమాపణలు చెప్పాలంటే బీజేపీకి చెందిన చాలా మంది కేంద్రమంత్రులు క్షమాపణలు చెప్పాల్సి వస్తుందన్నారు. పార్లమెంటులో వాదన వినిపించకుండా విపక్ష ఎంపీల మైకులు కట్ చేయడం, అయినా నోరు మూయకపోతే జైలుకు పంపించడం బీజేపీ సర్కారుకు అలవాటుగా మారిందని విమర్శించారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్లమెంటు నియమాలను పాటించడంగానీ, న్యాయవ్యవస్థకు గౌరవం ఇవ్వడంగానీ, రాజ్యాంగ నిబంధనల ప్రకారం నడుచుకోవడంగానీ జరగలేదని సంజయ్ రౌత్ మండిపడ్డారు. ఆఖరికి సీబీఐ, ఈడీ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థల కార్యకలాపాల్లో, న్యాయవ్యవస్థ కార్యకలాపాల్లో కేంద్రం జోక్యం పెరిగిపోయిందని ఆరోపించారు. దేశంలో లా అండ్ ఆర్డర్‌ను పూర్తిగా కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందని ఫైరయ్యారు.ప్రస్తుతం భారతదేశ న్యాయవ్యవస్థ ప్రమాదంలో పడిందని రౌత్ వ్యాఖ్యానించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి 'మేం చెప్పినట్లు చేయకపోతే, మేమూ చూస్తాం' అని న్యాయవ్యవస్థపై బెదిరింపు ధోరణి వ్యాఖ్యలు చేయడం దారుణమని చెప్పారు. ఆ వ్యాఖ్యలకు అర్థం ఏమిటని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థపై ఎలాంటి ఒత్తిళ్లు లేవని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ చెప్పారని, కానీ ఒత్తిళ్లు ఉన్నాయని సంజయ్ రౌత్ పేర్కొన్నారు.



## దేశంలో ఆపద కాలం నడుస్తోంది: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ మరోసారి ఆగ్రహం వ్యక్తంచేశారు. అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయడానికి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమున్నదని ఆయన ప్రశ్నించారు. స్నేహితుడిని కాపాడుకోవడానికి మోదీ సర్కారు ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు.తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మినహా 16 విపక్షాలు అదానీ అంశంలో విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నాయని, అయితే ఈ అంశం నుంచి విపక్షాల దృష్టి మళ్లించేందుకు అధికారపక్షం అకస్మాత్తుగా రాహుల్‌గాంధీ లండన్ ప్రసంగాన్ని ముందుకు తీసుకొచ్చిందని జైరాం రమేశ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని, రాహుల్‌గాంధీని అప్రతిష్ఠపాలు చేయాలన్న దురుద్దేశంతో కేంద్రం ఈ ఎత్తుగడ వేసిందని మండిపడ్డారు.పార్లమెంటు తమ వాదనలను ప్రభుత్వం ఖాతరు చేయడంలేదని జైరాం ఆరోపించారు. ప్రస్తుతం దేశంలో నడుస్తున్నది అమృత కాలం కాదని, ఆపద కాలమని వ్యాఖ్యానించారు. అంతా నియంతృత్వం రాజ్యమేలుతోందని ఫైరయ్యారు.

## ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలి: పవన్ కల్యాణ్



అమరావతి : ఎపిలో కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్లతో రైతాంగం తీవ్రంగా దెబ్బతిన్నదని జనసేనాని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం ఉదారంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రాథమిక అంచనా ప్రకారం 2 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఇప్పుడు వడగండ్లతో కూడిన వర్షాలు మరింత కుంగదీస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మిర్చి రైతులు... ఉమ్మడి కఅష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మామిడి, పొగాకు, మొక్కజన్న రైతులు... ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉద్యాన పంటల రైతులు... నెల్లూరు జిల్లాలో వరి రైతులు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయారని వివరించారు. రాష్ట్రంలో అరటి, మొక్కజన్న, కర్బూజ, బప్పాయి పంటలు కూడా దెబ్బతిన్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి తక్షణమే ఆర్థికసాయం, పంట నష్టపరిహారాన్ని అందించాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.



# చదువే ఏకైక మార్గం

**(మొదటి పేజీ తరువాయి)**

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మాట్లాడుతూ ... " సినిమాల్లో హీరోలే నచ్చుతారు.. విలన్‌లు నచ్చరు.. ఎన్నికుట్రలు చేసినా గెలిచేది మంచి మాత్రమే ... చివరికి మంచి చేసిన వారే గెలుస్తారు... ఎందుకు ఈ తోడేళ్లు ఏకమవుతున్నాయి ... పొత్తుల కోసం వీళ్లంతా ఎందుకు వెంపర్లాడుతున్నారు ... అర్హతలేని వారు మన ప్రభుత్వంపై రాళ్లు వేస్తున్నారు ... " విలువలు లేని దుష్టచతుష్టయంతో యుద్ధం చేస్తున్నామన్నారు. కుటుంబం, రాజకీయ, మనవతా విలువలు లేని దుష్టచతుష్టయంతో యుద్ధం చేస్తున్నామని అన్నారు.

**కాలేజీ ఫీజులు ఎంతైనా సరే పూర్తి బాధ్యత మీ జగనన్నదే**

కొత్తగా 14 డిగ్రీ కాలేజీలు తీసుకొచ్చామని సిఎం జగన్ అన్నారు. 17 మెడికల్ కాలేజీలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. 45 నెలల్లో డీబీటీ ద్వారా నేరుగా రూ.1.9 లక్షల కోట్లు అందించామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫీజులు చెల్లిస్తున్నామన్నారు. ఫీజులు మాత్రమే కాదు వసతి ఖర్చులు కూడా ఇస్తున్నామన్నారు. ఏప్రిల్ 11న రెండో విడత వసతి దీవెన నిధులు విడుదల చేస్తామని సిఎం ప్రకటించారు. ఈ పథకాలతో చదువుకునే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. జీఈఆర్ రేషియో 32 నుంచి 72 శాతానికి తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రభుత్వ బడులు, కార్పొరేట్ స్కూళ్లతో పోటీ పడేలా చేస్తున్నామన్నారు. " మీ పిల్లల చదువులకు నాది బాధ్యత " అని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఉన్నత విద్యకు మరింత ఊతమిచ్చే చర్యలు తీసుకున్నామన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నామన్నారు. రెండేళ్లలో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని సిఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో కార్పొరేట్ స్కూళ్లు పోటీపడే పరిస్థితి తెస్తామని సిఎం జగన్ పేర్కొన్నారు. కాలేజీ ఫీజులు ఎంతైనా సరే పూర్తి బాధ్యత మీ జగనన్నదేనన్నారు.

**కాలేజీలో సమస్యలుంటే 1092కి ఫిర్యాదు చేస్తే మేమే స్వయంగా మాట్లాడతా**

గత ప్రభుత్వంలో కాలేజీ ఫీజులు బకాయిలు పెట్టేవారనీ, ఫీజులు కట్టలేక చదువులు మానివేసే పరిస్థితి రాకూడదని సిఎం జగన్ అన్నారు. లంచాలు, వివక్ష లేకుండా తల్లుల ఖాతాల్లో విద్యాదీవెన నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అరకొరగా ఇచ్చేవాళ్లనీ, ఫీజులు కట్టలేక విద్యార్థులు అవస్థలు పడేవారనీ అన్నారు. తల్లిదండ్రులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలున్నాయన్నారు. అందుకే విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నామన్నారు. జగనన్న విద్యాదీవెన ద్వారా ఇప్పటివరకు రూ.9,947 కోట్లు ఇచ్చామన్నారు. 27 లక్షల మంది పిల్లలకు లబ్ధి చేకూర్చామన్నారు. చంద్రబాబు హయాంలోని బకాయిలను సైతం చెల్లించామని అన్నారు. విద్యాదీవెనతోపాటు వసతి దీవెన కూడా ఇస్తున్నామన్నారు. తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం ద్వారా ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. కాలేజీలో సమస్యలుంటే 1092కి ఫిర్యాదు చేస్తే తామే స్వయంగా మాట్లాడతామని సిఎం జగన్ చెప్పారు.

**తిరువూరుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వరాలు జల్లు**

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి విద్యాదీవెన కార్యక్రమంలో భాగంగా తిరువూరు వచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణనిధి విజ్ఞప్తి మేరకు గంపలగూడెంలో కట్టలేరు వాగు వద్ద హైలెవిల్ బ్రిడ్జి కోసం రూ.26 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అదే విధంగా ఎ.కొండూరు కిడ్ని బాధితుల సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు కృష్ణాజిల్లాలు కోసం రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో మరో 6000 ఇళ్ళు మంజూరు అంగీకరించారు. దీనికి కోసం రూ.250 ఖర్చు అవుతుందని అన్నారు. రోడ్ల రిపేరు కోసం రూ.10 కోట్లు, తిరువూరులో డ్రైనేజి కోసం రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. తిరువూరులో స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పుతున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## ఉత్తరప్రదేశ్‌లో 'విద్యుత్ సంక్షోభం'..

### 'బిజిలీ వ్రతం' ప్రకటించిన అఖిలేష్ యాదవ్



లక్నో: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో 'విద్యుత్ సంక్షోభం' ఏర్పడింది. తమ డిమాండ్లపై ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేల సంఖ్యలో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో విద్యుత్ సంక్షోభం వల్ల కష్టాలు పడుతున్న ప్రజలకు మద్దతుగా నిలిచేందుకు ఆ రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ముందుకు వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ 'బిజిలీ వ్రతాన్ని' ఆదివారం ప్రకటించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభ సమస్య పరిష్కారమయ్యే వరకు జనరేటర్లు వంటి ప్రత్యామ్నాయ విద్యుత్ వనరులను వినియోగించ వద్దని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు హిందీలో ట్వీట్ చేశారు. 'ఎస్పీ నేతలు 'బిజిలీ వ్రతం' చేస్తారు. ప్రజలకు మద్దతుగా ఉంటారు' అని పేర్కొన్నారు. మరోవైపు విద్యుత్ ఉద్యోగుల సమ్మె వల్ల కరెంట్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కూడా స్పందించింది. దీనిపై శనివారం నిరసన చేపట్టింది. బీజేపీ నేతృత్వంలోని సీఎం యోగి ఆదిత్యనాథ్ సర్కార్, ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అని విమర్శించింది. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టింది.

## ఈనెల 26న పార్స్ ఆధ్వర్యంలో జరగనున్న 100 కులాల నాయకుల సదస్సును విజయవంతం చేయండి

### పార్స్ అద్వయిజరీ కమిటీ మెంబర్ జి.ఉమామహేశ్వరరావు



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) ఆధ్వర్యంలో 100 కులాల నాయకులతోటి 26-3-23 విజయవాడ లో ఒకరోజు సదస్సు ను విజయవంతం చేయాల్సిందిగా పార్స్ అద్వయిజరీ కమిటీ నెంబర్ జి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో ఉమామహేశ్వరరావు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పై సమావేశం లో పార్స్ నేషనల్ కన్వీనర్ కటికల శివ భాగ్యరావు ఐఆర్ఎస్ విఆర్ఎస్ ,పార్స్ గౌరవ అధ్యక్షులు దాసరి కేశవులు , పార్స్ స్టేట్ కోఆర్డినేటర్ నమ్మి అప్పారావు యాదవ్, మీడియా ఏపీ ఇంఛార్జి గురజాల శ్రీనివాసరావు, పార్స్ అడ్వైజర్ కమిటీ మెంబర్ ఎంఎ. రజాక్, పార్ట్స్ నెంబర్ పి. ప్రతాప్, సిహెచ్.కృష్ణ,పార్స్ స్టేట్ యువజన విభాగ అధ్యక్షుడు నమ్మి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ నివాసానికి ఢిల్లీ పోలీసులు



న్యూఢిల్లీ : "మహిళలు ఇప్పటికీ లైంగిక వేధింపులకు గురవుతున్నారు" అన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై ఢిల్లీ పోలీస్ ఉన్నతాధికారులు ఆదివారం ఆయన నివాసానికి చేరుకున్నారు. భారత్ జోడో యాత్ర సమయంలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. లైంగిక వేధింపులకు సంబంధించి ఆయనను సంప్రదించిన మహిళల వివరాలను అందించాలని పోలీసులు మార్చి 16న రాహుల్‌గాంధీకి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. శ్రీనగర్‌లో భారత్ జోడోయాత్ర నిర్వహిస్తున్న సమయంలో ఇప్పటికీ స్త్రీలపై వేధింపులు జరుగుతున్నాయని రాహుల్‌గాంధీ పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ మహిళల వివరాలను తెలుసుకుని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ వివరాలు ఇవ్వకపోతే.. అతనికి మరో నోటీసు ఇవ్వబడుతుందని ఢిల్లీ పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి. రాహుల్‌గాంధీకి నోటీసులు జారీ చేయడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితుల పేర్లను వెల్లడించమని ఢిల్లీ పోలీసులు అతనిని బలవంతం చేయలేరని మండిపడింది.

## ఓడినా.., ప్రజా సమస్యల పరిష్కారం పై పోరాటం ఆపే ప్రసక్తే లేదు: ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నీలం శ్యామ్యూల్ మోజెస్



చీరాల, మార్చి 19, ప్రజాపాలన : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన, తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి, ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా, పోటీ చేసిన నీలం శ్యామ్యూల్ మోజెస్, ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. విజయం సాధించిన వారు ప్రజా పక్షంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి, అంకితభావంతో పనిచేస్తారని ఆశిస్తున్నానన్నారు. ఆ విధంగా సమస్యల పట్ల పనిచేయనట్లయితే, ఆ సమస్యల పరిష్కారానికి, వారి మీద కూడా తన వంతు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను తేలికగా తీసుకోకూడదన్నారు. దీనిని అధికార పక్షం సమీక్ష చేసి, భవిష్యత్తులో నష్టం జరుగకుండా, చూసుకోవాలని కూడా హెచ్చరించారు. మంచి కార్యకర్తలను, కష్టపడి పార్టీ కోసం పని చేసే కార్యకర్తలని, కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ మీద ఉందని, నీలంశామ్యూల్‌మోజెస్ అభిప్రాయపడ్డారు.

## పరారీలో అమృతపాల్ సింగ్ .. పంజాబ్‌లో హైఅలర్ట్



చండీగఢ్ : ఖలిస్తానీ వేర్పాటు వాద సానుభూతిపరుడు, 'వారిస్ పంజాబ్ దే' నేత అమృతపాల్ సింగ్ ఇప్పటికీ పరారీలో ఉన్నట్లు ఆదివారం పంజాబ్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. అతనిని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. శనివారం సాయంత్రం జలంధర్‌లో అమృతపాల్ సింగ్ చిక్కినట్టే చిక్కి మోటార్‌సైకిల్‌పై పారిపోయినట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం అతను ఎక్కడ ఉన్నాడో కచ్చితమైన సమాచారం లేదని అన్నారు. అయితే, అనుమానం ఉన్న అన్ని ప్రదేశాల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. దీంతో పంజాబ్ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఇంటర్నెట్‌పై నిషేధం కూడా విధించారు. 'వారిస్ పంజాబ్ దే' కి చెందిన 78 మంది సభ్యులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని విచారిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఆరు నుండి ఏడుగురు అమృతపాల్ సింగ్ గన్‌మెన్‌లు ఉన్నట్లు జలంధర్ పోలీస్ కమిషనర్ కుల్దీప్ సింగ్ చాహల్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవహారాలు నిర్వహిస్తున్న అమృతపాల్ సింగ్ సన్నిహితుడు దల్జీత్ సింగ్ కల్సిని కూడా హార్యానాలోని గుర్‌గావ్‌లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రజలు సంయమనం పాటించాలని.. ఎలాంటి తప్పుడు సమాచారాన్ని షేర్ చేయొద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అమృతపాల్‌కు అత్యంత సన్నిహితుడైన లవ్‌ప్రీత్ సింగ్ అలియాస్ తూఫాన్ సింగ్‌ను ఇటీవల పంజాబ్ పోలీసులు ఓ కిడ్నాప్ కేసులో అరెస్టు చేశారు. ఈ అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ అమృతపాల్ తో పాటు అతని మద్దతుదారులు ఫిబ్రవరి 24న అమృతసర్ జిల్లాలోని అజ్‌నాలా పోలీస్‌స్టేషన్‌పై దాడికి దిగారు. సిక్కుల పవిత్ర గ్రంథంతో అమృతపాల్ , నిరసనకారులు బీభత్సం సృష్టించడంతో పోలీసులు లవ్‌ప్రీత్‌ను విడుదల చేశారు.

## పవన్ చెప్పేవన్నీ తియ్య తియ్యని అబద్దాలే: పేర్ని నాని



అమరావతి: జనసేనాని పవన్ కల్యాన్ మచిలీపట్నం సభపై మాజీ మంత్రి పేర్ని నాని స్పందిస్తూ, పవన్ చెప్పినవన్నీ తియ్య తియ్యని అబద్దాలు అంటూ వ్యాఖ్యానించారు.. దుర్యోధనుడు, ధృతరాష్ట్రుళ్లను పక్కనే ఉంచుకుని తొడలు కొట్టే రాజకీయం పవన్ కళ్యాణ్ చేస్తున్నారని మండిపడ్డారు.. ఓ నాయకుడు పార్టీ పెట్టి మూసేశాడంటూ సొంత అన్ననే పవన్ హేళన చేశారని గుర్తు చేశారు. రాజకీయాల్లో వచ్చి పదేళ్ళు అవుతుందని పవన్ అన్న మాటలకు కౌంటర్ ఇస్తూ, 2009లో యువరాజ్యం అధ్యక్షుడు కాదా? అది రాజకీయం కాదా? అని పేర్ని నాని ప్రశ్నించారు. ప్రజారాజ్యం పెట్టిన తన అన్న చిరంజీవినీ పరోక్షంగా ఎత్తిపొడుస్తున్నాడని మండిపడ్డారు. డబ్బులు లేవు అంటూనే రోజుకు రెండు కోట్లు నా సంపాదన అని తనే అన్నారని ఎద్దేవా చేశారు. . బందర్ లో బీసీ డిక్లరేషన్ అని బీసీలకు మాటిచ్చారని, 48 గంటలు కూడా అవ్వక ముందే బీసీ డిక్లరేషన్ మాట మర్చిపోయారని సెటైర్లు వేశారు. నోరు తెరుస్తే కులం పేరుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పవన్‌కు సంకల్పం, చిత్తశుద్ధి, నాయకత్వం ఉంటే తన లాంటి వాళ్లు ఆయన వెనుకే ఉండేవారమని, జగన్ వెంట ఎందుకు వెళ్తామంటూ ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ సభ అర్థరాత్రి మద్దెల దరువు అంటూ వ్యాఖ్యానించారు. పవన్ దుర్మార్గమైన రాజకీయ క్రీడ ఆపాలన్నారు. ముసుగులు వేసుకుని కాకుండా చెట్టాపట్టాలేసుకుని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి రండి అంటూ సవాల్ చేశారు. వచ్చే ఎన్నికలలో ఒంటరిగా వచ్చినా , కలసి వచ్చినా చిత్తుగా ఓడిస్తామని పవన్, చంద్రబాబులను హెచ్చరించారు నాని..

## డెమొక్రటిక్ పి ఆర్ టి యు ఆంధ్ర ప్రదేశ్ కార్యాలయం ప్రారంభం



గుంటూరు:ఆదివారం ఉదయం పదిగంటలకు democratic PRTU A.P రాష్ట్ర కార్యాలయం , పెద్దలు పిన్నమనేని వెంకటేశ్వర రావు , మాజీ మంత్రి వర్యులు , ఆంధ్రప్రదేశ్ , SCERT డైరెక్టర్ , డాక్టర్ ప్రతాపరెడ్డి , డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్, డాక్టర్ దేవానందరెడ్డి ,కృష్ణా జిల్లా విధ్యాశాఖాధికారిణి శ్రీమతి తాహేరా సుల్తానా , NGO అసోసియేషన్ నాయకులు, మహ్మద్ ఇక్బాల్ , విధ్యాసాగర్ , శ్రీమతి కలపాల నీలిమా దేవి ట్రస్ట్ ఛైర్మన్ శ్రీ చావలి అబ్రహం లింకన్ , రాష్ట్ర సంఘ ప్రధాన సలహాదార్లు , శ్రీ మరడాల అచ్యుతరావు , కెతా సుధాకరరెడ్డి , ముఖ్య అతిధులుగా , డెమొక్రటిక్ పి.ఆర్.టి.యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు , డాక్టర్ శ్రీను , వెంకటేశ్వరరావు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. విజయవాడ లోని , గాంధీనగర్ లోని రాజ్ యువరాజ్ థియేటర్ ఎదురుగా కాకాని వెంకటరత్నం విధ్యా ప్రాంగణం లో మొదటి అంతస్థులో గల సువిశాల హాలు మొత్తం , పెద్దలు పిన్నమనేని వెంకటేశ్వరరావు , మాజీ మంత్రి వర్యులు , ఆంధ్రప్రదేశ్, వారు మరియు పెద్దలు కలసి, Democratic PRTU A.P సేవాదళ్ కార్యక్రమాలకు మెచ్చి , వారి రాష్ట్ర కార్యాలయంగా , ఉపాధ్యాయ సంబంధిత , సేవా దళ్ విభాగ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఇవ్వడం జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమం తరువాత ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ఉపాధ్యాయుల పాత్ర అనే అంశం పై విధ్యా సదస్సు నిర్వహించబడటం జరిగింది. ముందుగా SCERT డైరెక్టర్ , డాక్టర్ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ , డాక్టర్ శ్రీను ఆధ్వర్యంలో సేవాదళ్ కార్యక్రమాలు నిరంతరం ఎంతో గొప్పగా , సమాజానికి , విధ్యారంగానికి ఉపయోగకరంగా ఉంటూ వస్తున్నాయని , ఇటువంటి గొప్ప కార్యక్రమాలకు శ్రీమతి కలపాల నీలిమాదేవి ట్రస్ట్ ఛైర్మన్ గా ఉన్న శ్రీ చావలి అబ్రహం లింకన్ ఇస్తున్న సహకారాన్ని , కొనియాడటం జరిగింది. ఈ భవనాన్ని , డాక్టర్ శ్రీను నాయకత్వంలోని democratic PRTU A.P రాష్ట్ర కార్యాలయ భవనంగా వాడుకోవడానికి ఇవ్వడం అనేది సరియైన నిర్ణయం అని , ఇందులకు నిర్ణయం తీసుకున్న పెద్దలను కొనియాడటం జరిగింది. డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ , డాక్టర్ దేవానందరెడ్డి మాట్లాడుతూ , విధ్యా సంబంధ మయిన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ , శ్రీను సామాజిక పరమైన సేవా కార్యక్రమాలు కూడా ఎన్నో చేసారని , వారి కి చెందిన సేవాదళ్ విభాగానికి , వారి యూనియన్ రాష్ట్ర కార్యాలయానికి , కార్యక్రమాలు నిర్వహించుకునేటందులకు ఇవ్వడమనే నిర్ణయం సరియైనది అని చెబుతూ , ఇక భవిష్యత్తులో ఈ భవనంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించబడతాయ నే విశ్వాసం , తమకు బలం గా ఉందని వారు పేర్కొనడం జరిగింది. కృష్ణా జిల్లా విధ్యాశాఖాధికారిణి శ్రీమతి తాహేరా సుల్తానా కూడా , డాక్టర్ శ్రీను నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎంతగానో మెచ్చుకోవడం జరిగింది. ఇంత మంచి స్ధలంలో , ఇంతటి కార్యాలయాన్ని , తమ రాష్ట్ర కార్యాలయంగా వినియోగించుకో వడానికి , ఆ విధంగా ఇచ్చిన పెద్దలు ఇవ్వడానికి , డాక్టర్ శ్రీను అర్హుడైన వారు అని తెలియపరచడం జరిగింది. మహ్మద్ ఇక్బాల్ , విధ్యాసాగర్ మాట్లాడుతూ , సేవాదళ్ విభాగానికి న్యాయం పూర్తి స్ధాయిలో చేస్తున్న , చేయగల వారు శ్రీను గారని వారు కొనియాడటం జరిగింది. రాష్ట్ర అధ్యక్ష , కార్యదర్శులు డాక్టర్ శ్రీను , వెంకటేశ్వరరావు మాట్లాడుతూ , పెద్దలు కోరుకున్న స్ధాయిలో సామాజిక కార్యక్రమాలు , ఉపాధ్యాయ సంబంధిత కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తాము పెద్దల గౌరవాన్ని కాపాడతామని చెప్పడం జరిగింది. కార్యక్రమానికి వివిధ జిల్లాల, మండలాల అధ్యక్ష , కార్యదర్శులు పెరుమాళ్ళు , నున్నా రాంబాబు , జమలయ్య ,ప్రభాకర్ , జువ్వా జ్ఞానేశ్వరరావు , సలివేంద్ర బాలసుందర్రావు , నర్రా సుధాకర రావు , బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ , సయ్యద్ అక్బర్ పాషా , కంది వెంకట రమణ , రామకృష్ణ , సత్యన్నారాయణ , మధుసూదనరెడ్డి ,మణి కుమార్ , వెంకట రెడ్డి , నాగేంద్ర , ఉమ ,కొల్లిపర ఆనందరావు , సి.హెచ్ కృపావతి , శిరీష , కొండముది పద్మకోటి , కొలుసు శ్రీ లక్ష్మి , మేకల అరుణ్ , తాడిబోయిన రమేష్ ,దోకిన యలమంద , నర్రా చంద్రం , నర్రా శివరామకృష్ణ , తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులు , సంఘ కార్యకర్తలు , ఉపాధ్యాయులు అనేకంగా పాల్గొనడం జరిగింది.

## యువగళం పాదయాత్రకు ఎలాంటి అడ్డంకులు ఉండ కూడదని స్వామివారికి పూజలు చేస్తున్న బొల్లా రామ కృష్ణ



నందిగామ 19 ప్రజా పాలన ప్రతినిధి:మండల పరిధి లో మాగల్లు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దే వస్థానం నందు స్వామివారి కళ్యాణానికి తెదేపా నా యకులు బల్లా రామకృష్ణ హాజరై దర్శించుకుని ఎమ్మె ల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించిన సందర్భంగా యువగళం పేరుతో నారా లోకేష్ చేస్తున్నటువంటి పాదయాత్రకు ఎటువంటి ఆటంకం లేకుండా ముందు కు సాగాలని మరల నారా చంద్రబాబు నాయుడు 2024 ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ప్రత్యేక పూ జలు నిర్వహించారుఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటి సి మాసవరపు రామ కోటేశ్వరరావు చెరుకుమల్లి బా బుగుండెపోగు ముసలయ్యతదితరులు పాల్గొన్నారు.

## జివి.ని సన్మానించిన -రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి రఫీ



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మార్చి 19 (ప్రజాపాలన ప్రతినిధి. ):రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గా నియమితులైన షేక్ మొహమ్మద్ రఫీ పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జివి. ఆంజనేయులు ను శనివారం పల్నాడు జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ పార్టీ తన పై నమ్మకంతో ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టి, తిరిగి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం తన వంతు కృషి చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు బడే బాబు, తెలుగు యువత నాయకులు యూనస్, కరీం, రఫీ, అనీఫ్, షరీఫ్, గణేష్, బాషా, సలాం, ఖాసీం పీరా, తమ్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ వైద్య సేవలను వినియోగించుకోండి: డాక్టర్ తాడివలస దేవరాజు

### మార్చి 21న శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ నందు ఉచిత హెర్ని యా ఆపరేషన్ల వైద్యశిబిరం



చీరాల, మార్చి 19, ప్రజాపాలన : కార్పొరేట్ వైద్య సేవలను, తెల్ల రేషన్ కార్డు ఉన్నవాళ్ళు, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా పొందవచ్చుని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. ప్రముఖ లాప్రోస్కోపీ, జనరల్ సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీనారా యణ ఆధ్వర్యంలో, డాక్టర్.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా హెర్నియా, జీర్ణకోశ ఆపరేషన్లు చేయుటకు, ఉచిత వైద్య శిబిరం మార్చి 21 మంగళవా రం ఉదయం 9గంటల నుండి ఒంటిగంట వరకు, చీరాల శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ నందు నిర్వహించబడుతుందని, ఈ వైద్య శిబిరంనందు, అన్ని రకాల హెర్నియాఆపరేషన్లు, వరిబీజం ఆపరేషన్లు, సున్తీ ఆపరేషన్లు, 24గంటల కడుపునొప్పి, పెద్ద ఆపరేషన్ లు, గాల్‌బ్లాడర్ లో రాళ్లు ఉన్నవారికి, కిడ్నీలో రాళ్లు ఉన్నవారికి ఆపరేషన్లకు, ఉచితముగా ఓపి చూసి, సలహాలు, వైద్యం అందించబడుతుందని తెలిపారు.రక్తనాళాలు ఉబ్బిన వారికి, పైల్స్, ఫిషర్, లూటీలకు అత్యాధునికమైన లేజర్ ద్వారా ఆపరేషన్లు చేయబడునని, మరిన్ని వివరాలకు సురేష్ మహల్ పక్కన, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్‌లో లేదా 789 789 0737, 9000 808 198 నంబర్లలో సంప్రదించాలని, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు తెలిపారు.

# పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదువుకోవాలనేది సీఎం జగన్ లక్ష్యం

## పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లో తేటి



పల్నాడు జిల్లా. నరసరావుపేట .మార్చి 19 (ప్రజా పాలన ప్రతినిధి): పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలను అమలుచేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన క్రింద 2022 అక్టోబర్ – డిసెంబర్ త్రైమాసికానికి నిధుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి యన్.టి.ఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం ప్రారంభించారు. డి.బి.టి విధానంలో బటన్ నొక్కి 9.86 లక్షల మంది విద్యార్థులకు లబ్దిని చేకూరుస్తూ రూ.698.68కోట్లను తల్లుల ఖాతాల్లో నేరుగా జమచేశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే చెల్లిస్తున్నట్లు చెప్పారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంత మంది పిల్లలకు పూర్తి ఆర్ధిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఏటా రెండు వాయిదాలలో ఐటిఐ విద్యార్థులకు రూ. 10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన క్రింద రూ.13,311 కోట్లు నేరుగా తల్లుల ఖాతాల్లో జమచేసినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీ శివ శంకర్ లో తేటి నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని ఎస్. ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి 39,790 మంది లబ్ధిదారులకు గాను 35,989 మంది తల్లులు ఖాతాలో 32.46 కోట్ల రూపాయల నిధులను తల్లుల ఖాతాలలో జమ చేశారు. అందులో ఎస్ సి వెల్ఫేర్ శాఖ ద్వారా 7887 మంది విద్యార్థులకు 7.88 కోట్ల రూపాయలు, ఎస్టీ సంక్షేమ శాఖ ద్వారా 2817 విద్యార్థులకు 1.87 కోట్ల రూపాయలు, వెనుకబడులు తరగతుల సంక్షేమ శాఖ ద్వారా 12259 మంది విద్యార్థులకు 8.73 కోట్ల రూపాయలు, ఈ బీసీ క్రింద 10084 మంది విద్యార్థులకు 9.05 కోట్ల రూపాయలు, 3031 కాపు వర్గానికి చెందిన వారికి 2.27 కోట్ల రూపాయలు,, ముస్లిం మైనారిటీ శాఖ ద్వారా 3582 మంది విద్యార్థులకు 2.55 కోట్ల రూపాయలు క్రిస్టియన్ మైనారిటీ ద్వారా 129 మందికి 0.11 కోట్ల రూపాయలు వెరసి మొత్తం 32.46 కోట్ల రూపాయలు తల్లులుకాదుల జమైనట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ అనంతరం లబ్ధిదారులకు 32.46 కోట్ల రూపాయల భారీ చెక్కును విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కలిపి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీవినాయకం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు, డిటిడబ్ల్యుఓ వరలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫాదరు మైఖేల్ 40వ గురుపట్టాభిషేకం



గుడివాడ : ప్రతి ఒక్కరూ దేవుడు చూపిన మార్గంలో పయనించి తోటి వారికి సహాయకులుగా ఉండాలని 40వ గురుపట్టాభిషేకాన్ని జరుపుకున్న ఫాదరు గుజ్జుల మైఖేల్, 4 సం॥లు సహాయ ఫాదర్ కొండల రజనీకాంత్‌లు అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్‌కార్మెల్ (ఆర్.సి.ఎం.) దేవాలయంలో ఫాదర్ గుజ్జుల మైఖేల్ గురువుగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకుని 41వ సం॥లోకి అడుగిడిన సందర్భంగా సహాయ గురువుగా కొండల రవికాంత్ 4వ గురుపట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కౌన్సిల్ అధ్యక్షులు ఏలేటి విలియంజోషి ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులు, పలువురు భక్తులు ఫాదర్‌లను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దివ్యపూజా బలిలో ప్రసగిస్తు ఫాదర్ మాట్లాడుతూ తన జీవితం ప్రభువు సేవలో 40 సంవత్సరాలు పూర్తి అవ్వటం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. తాను గురువు అయినప్పటి నుండి ఎంతోమందిని దేవుని మార్గంలోకి తీసుకువెళ్ళటం జరిగిందన్నారు. అదేవిధంగా ఎంతోమందిని గురు విద్యార్థులుగా కూడా తీర్చిదిద్దటం జరిగిందన్నారు. దేవుని చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి, తన వలే తన పొరుగువారిని ప్రేమిస్తూ ఉన్నదానిలోనుండి కొంతైనా సహాయం చేయాలని ఆయన భక్తులకు సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు వంగా ఆనంద్, రెబ్బా బాలరాజు, ఇంటి స్వామిదాసు, వి.జీవరత్నం, ఉపదేశకులు దార సబాస్టీన్, కీస్తురాజు, భాస్కర్, ఆంతోని, స్వామిదాసు, కిరణ్, మరియదళ సభ్యులు, దీక్షా సభ్యులు, యూత్ నాయకుడు జ్యోషి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్రాంతి ఉద్యోగుల వార్షికోత్సవం



ప్రజాపాలన, విస్సన్నపేట ప్రతినిధిరాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం విస్సన్నపేట యూనిట్ 17వ వార్షికోత్సవం ఘనంగా విశ్రాంతి ఉద్యోగుల భవనం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి.లవ కుమార్ మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కర్ హెల్త్‌కార్డులు వినియోగించుకోవాలని అన్నారు. రిటైర్డ్ అయిన వారికి రావాల్సిన బకాయిలపై ఉన్నతాధికారులతో మాట్లాడి సకాలంలో వచ్చే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. విస్సన్నపేట యూనిట్ తరుపున వార్షికోత్సవం జరుపుకోవటం ఆనందంగా ఉందని అన్నారు. విస్సన్నపేట ట్రెజరీ అధికారి ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు సంబందించిన అన్ని బిల్లులు ఎప్పటికప్పుడు క్లీయర్ చేస్తున్నామని అన్నారు. ఆనంతరం పలువురు రిటైర్ట్ ఉద్యోగులను, విశ్రాంతి ఉద్యోగులు జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైనా జె.వి.ఎల్ రాజేంద్ర ప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల విస్సన్నపేట యూనిట్ అధ్యక్షులు నల్లంటి సూరిరాజు, విశ్రాంతి ఉద్యోగుల వి.ఇమ్మానియేలు, శేషయ్య, గోపాలుడు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్లకు మీటర్లు రైతుల మెడకు ఉరితాడు: ఎమ్మెల్యే ఏలూరి




పర్చూరు, మార్చి 19, ప్రజాపాలన : రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతూ.. వైసిపి ప్రభుత్వం, రైతులను నిలువునా మోసం చేస్తుందని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు నియోజ కవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆది వారం సచివాలయం అగ్నిమాపక కేంద్రం వద్ద, టీడీపీ శాసనసభా పక్ష నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఏపీలో విద్యుత్ బాదుడు అంటూ ప్లకార్డుల ప్రదర్శన - స్మార్ట్ మీటర్ల పేరుతో, రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నారంటూ, ప్లకార్డులు ప్రదర్శించి, ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ, రైతులకు హాని చేసే మోటార్లకు మీట ర్లు పెట్టనివ్వమన్నారు. జగన్ సీఎం అయ్యాక రైతులకు అది ఇస్తున్నామని, ఇది ఇస్తున్నామని చెప్తున్నారే తప్ప,వాస్తవానికి రైతులకు ఇచ్చిందే మీ లేదన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో, వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వైసిపి హయాంలో రైతులకు క్రాప్ హాలిడే, పవర్ హాలిడే ఇచ్చారన్నారు.సీఎం అనాలోచిత నిర్ణయాల వల్ల, పవర్ సెక్టార్ కుప్పకూలిందన్నారు. మోటార్లకు మీటర్లు ఉచిత విద్యుత్ ను ఎత్తివేసేందుకే అన్నారు. అన్నదాతలకు నష్టం కలిగే ఏ నిర్ణయం అయినా తెలుగుదేశం పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు.

PAY BACK TO SOCIETY
SNEHA CLUB
స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్
SNEHA MACS
గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 20, మార్చి 2023

## 21వ శతాబ్దం ఇప్పుడు మొదలవుతోందా?

గోడ మీద కేలండర్లు, టేబుల్ మీద డైరీలు మారినప్పుడే కాలం మారినట్టు కాదు. కేలండర్ ప్రకారం మనం 21వ శతాబ్దంలో ప్రవేశించి 23 ఏళ్లవుతోంది. అప్పుడు మనలో చాలమంది ఏం మారింది, లోకం ఏమీ మారలేదు అనుకున్నాం. అదే అమెరికా, అదే రష్యా, చైనా, ఇండియా, పాకిస్థాన్... అనుకున్నాం. ఇప్పుడు నిజంగానే ప్రపంచం మారుతోంది. ఇది ఆధునిక (మోడర్న్) ప్రపంచం కాదు, ఉత్తరాధునిక (పోస్ట్ మోడర్న్) ప్రపంచం. అది ఎట్లన్నన్....యుక్రెయిన్ భూభాగం మీద రష్యా, నాటో యుద్ధం దాదాపు పూర్తయినట్టే. భూభాగాలకు సంబంధించి ఇప్పుడున్న స్థితి ఇక చాల కాలం కొనసాగుతుంది. ఇండియా పాకిస్థాన్‌ల మధ్య 'పాక్ ఆక్రమిత కశ్మీర్' అని మనం, 'ఆజాద్ కశ్మీర్' అని వాళ్లు వ్యవహరించే భూభాగం అప్పట్నించి అలానే ఉండిపోలేదూ? ఇలాంటి 'ఘర్షణల'కు ఒక ముగింపు అంటూ ఉండదు. ఎప్పటికో ఘర్షణలు బలహీనపడి చరిత్రలో కరిగిపోతాయి. గెలుపోటములూ, వాటి పరిణామాలే చరిత్రలో ఉంటాయి. పాప పుణ్యాలూ మట్టీ మశానం ఏమీ ఉండవు. అధ్యక్షుడిగా మారిన కమెడియన్ వొలీదిమీర్ జెలెన్స్కీ ఇకముందు ఒక విలన్‌గానే యుక్రేనియన్ల మనసుల్లో మిగిలిపోతాడు. యుక్రేనియన్ అంతరంగం ఈ అపజయానికి అతడిని క్షమించదు. వ్లాదిమీర్ పుతిన్ రానున్న రష్యన్ ఎన్నికల్లో పోటీ చేస్తాడో లేదో గాని, చేస్తే ఘన విజయం సాధిస్తాడు. ఈ యుద్ధ సమయంలో జరిగిన రాజకీయార్థిక పరిణామాలు మరింత కీలకమైనవి. అవి మనకు కూడా– మనమంటే, ఇది రాస్తున్న, నాకు చదువుతున్న, మీకు కూడా– చాల కీలకమైనవి. మనం ఒక కొత్త ప్రపంచంలో బ్రతకబోతున్నాం.వార్తల్లో ఉన్న మరో విషయం: ఆంక్షలతో రష్యాను దెబ్బతీయబోయిన అమెరికా తానే పెద్ద దెబ్బతింటున్నది. రవి ఎప్పుడో అస్తమించిన మాజీ వలసవాద బ్రిటన్, ఫ్రాన్స్ కూడా అమెరికాతో పాటు దెబ్బతిన్నాయి, ఇంకా తింటున్నాయి. 'ఆధునికత' కథ ఒక కొలిక్కి వొస్తోంది. అమెరికా, క్యాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (సివిబి), న్యూయార్క్‌లోని సిగ్నేచర్ బ్యాంక్ కుప్పకూలాయి. దానికి కారణం వాటి మిస్మేనేజ్మెంటు అంటున్నారు. కాదు సంక్షోభం కారణమని మరికొందరు అంటున్నారు. ప్రభుత్వ జోక్యంతో వాటి డిపాజిటర్లు గండం గడిచి గట్టెక్కినట్టున్నారు. తర్వాత, మన సునాక్ రుషి వర్యుని నాయకత్వంలోని 'ఐక్య రాజ్యం' (యునైటెడ్ కింగ్డమ్), ఆఫ్రికన్ నెత్తుటితో తడిసి రుచి తప్పిన ఫ్రెంచి మద్యం, సందట్లో సడేమియా అన్నట్టు పాలస్తీనాలో ఇజ్రాయిలీ రాజ్య–టెర్రరిజం... ఏది ఏమవుతుందో చెప్పలేం. జర్మనీతో సహా, చాల చోట్ల యుద్ధానికి నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి.బహుశా వీటన్నిటి కన్న, యుద్ధ పర్యవసానాల కన్న, పెద్ద పరిణామం: చైనా దౌత్యం ఫలించింది. ఇరాన్, సౌదీ అరేబియా దేశాలు తమ మధ్య షియా సున్నీ విభేదాల్ని పక్కన పెడుతున్నాయి. దౌత్య సంబంధాలు ఏర్పరచుకుంటున్నాయి. త్వరలో మిగతా మధ్యప్రాచ్య దేశాల మధ్య స్నేహ సంబంధాలు పెరిగి, వాటి మధ్య ఐక్యత ఒక రూపం తీసుకుంటోంది. అదీ చైనా, రష్యాల అండదండలతోనే. 'బ్రిక్స్' ('బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా' కూటమి) విస్తరణలో ఈ మిడిలీస్ట్ దేశాలు భాగం అవుతాయి. ఈ పరిణామాలు చిన్నా చితకవి కావు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత 'పెట్రో–డాలర్ ఆర్థికం' మీద ఆధారపడి తయారైన ఒక 'వరల్డ్ ఆర్డర్' కుప్పకూలుతున్నది. సందేహం లేదు. ప్రపంచానికి ఇప్పుడు 20వ శతాబ్ది ముగిసి 21వ శతాబ్దం మొదలవుతోంది. దీనికి యుక్రెయిన్ యుద్ధం పెద్ద సంకేతం. ఇదొక మైలురాయి. 21వ శతాబ్ది ప్రారంభానికి మరో పేరు: బహు కేంద్రక ప్రపంచం. (మల్టీ సెంటర్డ్ లేదా మల్టీ పోలార్ వర్ల్డ్). ఇక ప్రపంచానికి ఒక 'కేంద్రం'... 'ఒకే' కేంద్రం... ఉండబోదు. ఒక బహు–కేంద్రక ప్రపంచంలో జీవించబోతున్నాం. ఇప్పటికే జీవిస్తున్నామని చెప్పినా, అదేం ఎక్కువ మాట కాదు. దేవుడో, మానవుడోబీ అమెరికాయో, రష్యాయోబీ కేపిటలిజమో, పెట్టుబడిదారీ విధానమో.... ఏదో ఒకటి కేంద్రంగా, మరొకటి పోటీ కేంద్రంగా ఉండడం ఆధునికత (మోడర్నిజం). ఒకటి రెండు కాదు, పలు కేంద్రాలు ఉండడం... అంటే, ప్రాక్టికల్‌గా ప్రపంచ గతిని శాసించే బలమైన కేంద్రమేదీ లేకపోవడం... ఉత్తరాధునికత (పోస్ట్ మోడర్నిజం). ఉత్తరాధునిక ప్రపంచంలోని బహు కేంద్రక స్థితికి మరో పేరు ముక్కలు ముక్కల జీవితం (ఫ్రాగ్మెంటేషన్). సమాజంలో పేద, ధనిక... రెండు వర్గాలే ఉన్నాయి అనే భావన దాదాపు ఆధునిక యుగమంతటా వర్ధిల్లింది. ఇప్పుడు పేదల్లో రెడ్డి పేద, మాదిగ పేద ఒకటి కాదు. వాళ్లిద్దరు ఒకటి అనడం అంటే మాదిగ పేద నెత్తిన వ్రేలాడే కులం కత్తికి ఆయనను బలి చేయడమే అని దళితులు అంటున్నారు. బుద్ధి ఉన్న వారెవరూ ఆ మాటను కాదనలేరు. (అందరికీ అంబేడ్కర్ ఆశీస్సులు కావాలి మరి). అలాగే మగ పేద, ఆడ పేద ఒకటే అనడం అంటే స్త్రీల మీద మగాళ్ల లీగల్, ఇల్లీగల్ హింసను మన్నించడమేనని స్త్రీలు అంటున్నారు. మనసున్న వారెవరూ వారి మాట తప్పు పట్టలేరు.సామాజిక సమూహాలే కాదు. బడుగు దేశాలు... ముఖ్యంగా ఆఫ్రికా, దక్షిణ అమెరికాల్లో పేద దేశాలు ప్రపంచ పెద్దన్న మాట కాదని తమలో తాము సంఘాలు పెట్టుకుంటున్నాయి. సంఘటితమవుతున్నాయి. రష్యా, చైనాలు... వాటి పాలన వ్యవస్థలు ఏవైనా... అందులో ప్రజాస్వామ్య కాంక్షలకు చోటిచ్చి, ఆర్థికంగా పెట్టుబడిదారీ పద్ధతులనే అనుసరిస్తున్నాయి. ఆ సమాజాలు ఇనుపతెరలు మూసుకుని ఉండిపోవడం లేదు. తలుపులు తెరిచాయి. మాస్కోలో మెక్డొనాల్డ్ షాపులు వెలిశాయి. రష్యా చైనా దేశాలు పెట్టుబడిదారీ పద్ధతులను నామ్‌కే వాస్తే అనుసరించి ఊరుకోవడం లేదు. పెట్టుబడిదారీ పద్ధతుల్లో అమెరికాను, పశ్చిమ దేశాలను (ఉమ్మడిగానూ, వేర్వేరుగానూ) సవాలు చేస్తున్నాయి. ఈ సవాళ్ల ఫలితమే, అందులో వాటి శక్తి యుక్తుల ఫలితమే... ఎప్పటినుండో ఇరాన్ తదితర దేశాల మీద, కొత్తగా రష్యా, చైనాల మీద, అమెరికా ప్రయోగించిన వాణిజ్య ఆంక్షలు బెడిసికొట్టాయి. ఆంక్షల దెబ్బ... దెబ్బ కొట్టివాళ్లకే ఎక్కువగా తాకింది. ఇకముందు పశ్చిమానికి వాణిజ్య ఆంక్షల వంటి పరికరాలుండవు. పని చేయవు.మంచికో చెడుకో రష్యాను ఒక కుదుపు కుదిపి, ఒక మలుపు తిప్పిన మాజీ అధ్యక్షుడు మిహాయిల్ గోర్బచేవ్. ఆయన రూపొందించిన 'గ్లాస్ నోస్త్', 'పెరిస్త్రోయికా' విధానాల కింద రష్యా ఇనుప తలుపులు భళ్లున తెరుచుకున్నప్పుడే, జర్మనీ దేశాన్ని రెండుగా చీల్చిన బెర్లిన్ గోడ కూలిపోయినప్పుడే... ఇక ఏ వైరుధ్యాలు, ఏ అడ్డంకులు లేకుండా ప్రపంచ ప్రజాస్వామ్యం పురోగమిస్తుందని లోకం అనుకుంది. 'వార్సా ఒప్పందం' పేరిట, రష్యా నేతృత్వంలో పని చేసిన 'ఎర్ర' సైనిక కూటమి ఇక లేదు. ప్రపంచానికి 'కమ్యూనిజం ప్రమాదం' లేదు. అందువల్ల, నాటో అవసరం కూడా ఉండదని అందరూ అనుకున్నారు. ఆధునిక యుగం అయిపోయి, ఉత్తరాధునిక జీవితం మొదలవుతోందని అనుకున్నారు. ఇకముందు నాటోను విస్తరించేది లేదని... బెర్లిన్ గోడ కూలే సందర్భంలో గోర్బచేవ్‌కు... అమెరికా, పశ్చిమ దేశాలు మాట ఇచ్చాయి. రాతలో పెట్టకపోయినా మాట అయితే ఇచ్చాయి. యుక్రెయిన్‌లో సైతం.. క్రిమియా భూభాగం రష్యాలో విలీనమయ్యాక ఇక యుద్ధం వొద్దని ఇరు వాగుల వారు అనుకున్నారు. ఈ మేరకు బెలారస్ రాజధాని మిన్స్క్ నగరంలో యుక్రెయిన్, రష్యాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది.

# పారిస్ కమ్యూన్ : ఒక గమనం! ఒక గమ్యం!




పారిస్ కమ్యూనా..! ఏంటది..? కథా...? సినిమానా..? నవలా..? ఏదీ కాదు. 1871 మార్చి 18న పారిస్ కార్మికవర్గం మానవజాతి చరిత్ర పుస్తకంలో రాసిన ఒక అజరామర ఉదంతం. పెట్టుబడిదారీ వ్యవస్థ 17, 18 శతాబ్దాలలో ఐరోపా ఖండం, అమెరికాలలో వేళ్లూనికుని ప్రపంచాన్ని ఆవహించడానికి ఉవ్విళ్లూరుతూ... ఉగ్రూతలూగుతున్న రోజులవి. ఫ్రాన్స్ దేశంలో 1789లో సాగిన పెట్టుబడిదారీ విప్లవం (పారిశ్రామిక విప్లవం) ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేసింది. కారణం తరతరాల పురాతన సమాజాలను ముఖ్యంగా నాటి రాచరిక పాలనను ఆ దేశ పెట్టుబడిదారీ వర్గం అత్యంత హింసాత్మకంగా కూలదోసి ఆధునిక రాజ్య స్థాపన చేసింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలు మిన్నుముట్టాయి. అయితే కొద్ది దశాబ్దాలలోనే పెట్టుబడిదారీ వ్యవస్థ క్రూరత్వం ప్రపంచానికి తెలియవచ్చింది. ఐరోపా ఖండంలోనే ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఈ వ్యవస్థే సృష్టించిన కార్మికవర్గం తిరుగుబాట్లు ప్రారంభించింది. కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌ల నాయకత్వాన కమ్యూనిస్టు లీగ్ (1847) ఏర్పడింది. మొదటి అంతర్జాతీయ కార్మిక సంస్థ 1864లో ఏర్పడింది. మార్క్స్, ఏంగెల్స్‌లు 1848లో 'కమ్యూనిస్టు ప్రణాళిక' విడుదల చేశారు. ఈ క్రమంలో అదే ఫ్రాన్స్ దేశంలో కార్మికవర్గం 1871లో స్వతంత్రంగా పారిస్ నగరంలో అధికారంలోకి వచ్చి 72 రోజులు పరిపాలన సాగించింది. దీనినే "పారిస్ కమ్యూన్" అంటారు. కార్మికవర్గం ఏ పరిస్థితులలో అధికారంలోకి వచ్చింది, అధికారంలోకి వచ్చిన వెనువెంటనే నిమిషం కూడా ఆలస్యం చేయకుండా, క్షణం తీరిక లేకుండా కార్మికవర్గ ప్రభుత్వాన్ని ఎలా నడిపింది, కేవలం 72 రోజులలో ఏమేమి చేయగల్గింది, చివరకు ఎలా కూల్చబడింది... అన్నది నేటి తరానికి ముఖ్యంగా విప్లవ కార్మిక సంస్థలలో పనిచేస్తున్న యువతకు తెలియాలి.

**నేడు ప్రపంచ గమనం ఎటుంది?**

ఆధునిక రచయితలందరూ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక సాంఘిక వ్యవస్థగా అది పుట్టిన తరువాత ఎన్నడూ లేనంత బలహీనమైన స్థితికి చేరుకుంది అని రాస్తున్నారు. ఆర్థిక మాంద్యం, మానవ చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రమైన ఆర్థిక అసమానతలు, వీటికి తోడు నిరుద్యోగం, ఉపాధి లేమి, పేదరికం, ఆకలి, అనారోగ్యం, పర్యావరణ వినాశనం... నేటి పెట్టుబడిదారీ ప్రపంచం ప్రధాన లక్షణాలుగా ఉన్నాయి. ''మానవాళి తనకంటూ ఓ మంచి భవిష్యత్తు కావాలనుకుంటే ప్రస్తుత వ్యవస్థని కొనసాగనివ్వకూడదు. ఒక వేళ దీనిపైనే మూడవ సహస్రాబ్దిని నిర్మించాలనుకుంటే విఫలం అవుతాము. చివరకు మిగిలేది ఓ చీకటి సమాజమే'' అని ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ తేల్చి చెప్పాడు. కారల్ మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పినట్లు నేడు మునుపెన్నటికన్నా ప్రపంచం ఎక్కడికి చేరుకుందంటే సమాజాన్ని విప్లవాత్మకంగా పునర్ నిర్మించడమా? లేక పోటీపడుతున్న వర్గాలన్నీ సమిష్టిగా నాశనం అవటమా? అన్న దశకు చేరుకున్నాయి అనిపిస్తుంది.


**పారిస్ కమ్యూన్ పిలుపు**

తాను చెప్పిన ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, అందరికీ సుఖవంతమైన జీవితం, ఆధునిక ప్రగతిశీల భావాలు, శాస్త్రీయ దృక్పథంపై ఆధారపడ్డ సమాజాన్ని నిర్మిస్తాం అని నమ్మబలికిన పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టిన 100 ఏళ్లలోనే అవన్నీ దానికి సాధ్యం కాదని, ఆ పని విప్లవ కార్మికవర్గం మాత్రమే చేయగలదని 1871 లోనే పారిస్ కమ్యూన్ చేసి చూపించింది. మానవ చరిత్రలో మొట్టమొదటసారి కార్మిక వర్గం మాత్రమే ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటాన్ని సమసమాజం కోసం జరిగే పోరాటంగా మలచగలదని నిరూపించింది. 1871 మార్చి 18న ప్యారిస్ నగర కార్మికులు ఆ నగరం నుండి పెట్టుబడిదారులను తరిమేసి అధికారం చేపట్టారు. పది రోజుల తర్వాత మార్చి 28న ప్యారిస్ కమ్యూన్, కార్మిక ప్రభుత్వాన్ని, తొలి కార్మిక రాజ్యాన్ని స్థాపించారు. ఈ విప్లవం పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించింది. కారణం అవి క్రూరమైన మూఢ, మత విశ్వాసాలకు రూపాలుగా ఉన్న భూస్వామ్య రాచరిక పాలనను అంతం చేసిన పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతా విస్తరిస్తున్న రోజులు. ప్రజాస్వామ్యం, గణతంత్రం, లౌకికతత్వం, హేతువాదం, శాస్త్రీయ దృక్పథాల ఆధారంగా తన పరిపాలన ఉంటుందని పెట్టుబడిదారీ పాలకులు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్న రోజులు. అయితే అప్పటికే మార్క్స్, ఏంగెల్స్‌ల నాయకత్వాన ప్రారంభమైన మొదటి ఇంటర్నేషనల్ పెట్టుబడిదారీ దేశాల (జర్మనీ, ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లాండ్, బెల్జియం తదితర) అన్నింటా కార్మిక వర్గాన్ని పోరాటాలవైపు కూడగడుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బండారాన్ని బైటపెట్టి, దాన్ని కూల్చగలిగిన ఏకైక శక్తి కార్మిక వర్గమని, అది నిర్వహించాల్సిన చారిత్రక పాత్ర గురించి మార్క్స్, ఏంగెల్స్‌లు సిద్ధాంతం రూపొందించారు. కార్మికవర్గ విప్లవ సిద్ధాంతం–మార్క్సిజం కార్మిక వర్గంలో ప్రభావం కలుగ జేస్తున్నది. ఈ నేపథ్యంలో అనివార్యంగా వచ్చిన అవకాశాన్ని పారిస్ కార్మిక వర్గం అందిపుచ్చుకున్నది. జర్మనీతో సాగిన యుద్ధంలో ఫ్రాన్స్ ప్రభువు నెపోలియన్ 1870లో చేతులెత్తేశాడు. ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని స్థాపిస్తామని ప్రగల్భాలు పలికిన ఫ్రెంచి పెట్టుబడిదారులు చతికిలబడిపోయారు. జర్మన్ సైన్యాలు ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరాన్ని (ఇందులో 20 జిల్లాలు ఉంటాయి) చుట్టుముట్టాయి. ఈ పరిస్థితులలో పారిస్ కార్మికులు ఎదురు తిరిగారు. పెట్టుబడిదారులను తరిమేశారు. పారిస్ నగరాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. వెనువెంటనే తమది సోషల్ గణతంత్ర రాజ్యంగా ఉంటుందని ప్రకటించారు. దిమ్మ తిరిగిపోయిన ఫ్రెంచి పెట్టుబడిదారీవర్గం జర్మన్ ప్రభుత్వంతో, ఆ దేశ దోపిడీదారులతో నిస్సిగ్గుగా ఒప్పందం చేసుకొని వారి సైన్యం సహకారంతో పారిస్ నగరంపై తీవ్రమైన దాడి చేసి 72 రోజుల కార్మిక వర్గ రాజ్యాన్ని పారిస్ కమ్యూన్‌ని రక్తపుటేరుల్లో ముంచెత్తింది. సుమారు 40,000 మంది కమ్యూనార్డ్స్‌ని కాల్చిచంపారు. కొన్ని వేలమంది విదేశాలకు వెళ్లిపోవాల్సి వచ్చింది. జైళ్లు కమ్యూన్ కార్యకర్తలతో నిండిపోయాయి. పెట్టుబడిదారీ దేశాల పాలకులందరికీ మొదటి ఇంటర్నేషనల్‌ని నాశనం చేయాలని, అందుకు వారి దేశాల్లో ఉన్న ఇంటర్నేషనల్ నాయకుల్ని వేటాడి అంతం చేయమని పిలుపులు వెలువడ్డాయి. బూర్జువా పత్రికలు కమ్యూన్‌పై విషం చిమ్మే రాతలు రాశాయి.

**ప్యారిస్ కమ్యూన్ పాలన**

మార్చి 18 విప్లవం జయప్రదం కాగానే కార్మిక వర్గం నగరంలో ఎన్నికలు నిర్వహించింది. ప్రజా ప్రతినిధులు కార్మికులకు అందుతున్న (నాటికి ఆరు వేల ఫ్రాంకులు) కనీస వేతనం మాత్రమే తీసుకోవాలని షరతు విధించింది. కమ్యూన్ ఏర్పడగానే మొదటి చట్టం నిరంకుశ పోలీస్, సైన్యం వ్యవస్థలను రద్దు చేసింది. వాటి స్థానంలో శక్తివంతులైన ప్రజలే సైన్యం అని ప్రకటించింది. న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నత అధికారులు ఎవరైనా ప్రజలతో ఎన్నుకోబడాల్సిందే. నచ్చకపోతే వారిని దిగిపొమ్మని, తిరిగి వేరే వారిని ఎన్నుకునే హక్కును ప్రజలకు ఇస్తూ చట్టం చేయబడింది. ఫ్రాన్స్ జాతి ఉన్మాదానికి చిహ్నాలుగా ఉన్న రాచరిక ఆనవాళ్లను తొలగించి వేసింది. ప్రజలపై ఉన్న అక్రమ వడ్డీలను రద్దు చేసింది. మూసివేయబడ్డ కారా?నాలను కార్మికుల సహకార సంస్థలకు అప్పగించింది. కారా?నాలలో రాత్రి పనులు నిషేధించింది. కార్మికులపై అపరాధ రుసుం వేసే పద్ధతిని రద్దు చేసింది. విప్లవాత్మకమైన మరో నిర్ణయం ఏమంటే మతాన్ని, రాజ్యాన్ని విడగొట్టడం. లౌకిక విద్యను మాత్రమే బోధించాలని, మత విషయాలు పాఠ్యాంశాలలో ఉండరాదని చట్టం చేయడం. నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను రూపొందించింది. ఆ విధంగా కమ్యూన్ ఏవో కొన్ని సంకుచిత జాతీయ లక్ష్యాల కోసం కాకుండా మొత్తం అణగారిన శ్రామిక జనబాహుళ్యం కోసం నిలబడింది. పోరాడింది. పోరాడుతూనే నేలకొరిగింది. విఫలమైనప్పటికీ ఇటువంటి మహత్తర పోరాటాలను కార్మిక వర్గం చేస్తూనే ఉండాలి. "కొన్ని నిరాశా సందర్భాలలో కూడా అవకాశం ఉండదని తెలిసినప్పటికీ జరిగే పోరాటాలు ప్రజానీకాన్ని భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం చేయడానికి పాఠశాలలుగా ఉపయోగపడతాయని" అన్నాడు లెనిన్. కారల్ మార్క్స్ చెప్పినట్లు..."ప్యారిస్ కమ్యూన్ లక్ష్యాలు కార్మిక వర్గం విముక్తి చెందేవరకు చరిత్రలో మరలా మరలా ముందుకు వస్తూనే ఉంటాయి" అని గుర్తుంచుకోవాలి. నిజం. ఇప్పుడు మరలా ప్యారిస్ కమ్యూన్‌ని ముందుకు తెద్దాం. సాధించుకుందాం సోషలిస్టు వ్యవస్థని.

## చిన్న బిందువు




బురద మడుల్లో ఆడపడుచులు
చందమామల నడుముల్ని వంచి
వరినాట్లకు పాటల ఊపిర్ని పోస్తుంటే

చివర్లోజి
తియ్యటి పాటలు కాస్తాయనుకున్నా..!
కానీ,
ఎండిన, దిక్కుమాలిన రాకాసి కొమ్మకు
ఉరేసుకున్న దేశం కింద
ఏడుపై వస్తుందని
ఊహించలేకపోయాను!
'ప్రపంచం పెద్ద ప్రశ్నార్థకం
తెగ నలిగిపోతున్న చిన్న బిందువు రైతు'!

పుడమి చేయితో
పచ్చజెండాను నిరంతరం ఊపుతూ
లోకాన్ని కదుపుతూ
కాలం గొంతులో
అన్నం ముద్దై అడ్డుపడుతున్నాడు
నీళ్ళ కోసం
ఆయాసంతో తహతహలాడిపోతున్నాడు
అధిరోహించే ప్రతి పర్వతం
అగ్నిపర్వతమవుతుంది
కార్పొరేట్ల ఫొటోలకు
ఉరితాళ్ళే అందమైన ఫ్రేములు...!
ఏ కొమ్మను చూసినా
గుండెలు తరుక్కుమంటున్నాయి...
రైతు పుడమిని సంతోషంగా
తనివి తీరా వాటేసుకోవాలని పోతే
అక్కడికక్కడే మాయమవుతున్నాడు
ఎండమావై ..!

– శీర్పి చంద్రశేఖర్

## పోలిక



ఎవరు పోల్చారో
పోల్చుకున్నారో మొదటిగా
మనుషుల్ని వెంటాడుతోందది
మనసు మనసునీ మెలి పెడుతోంది
మనసంటూ లేని ఈ పోలిక
మనిషి మనిషికీ పోలిక
ఇంటికి ఇంటికీ పోలిక
ప్రతి అక్షరానికీ
మరో అక్షరంతో
క్షయం కాని పోలిక
కవిత కవితకీ పోలిక
పంక్తి పంక్తికీ పోలిక
కథ కథకీ పోలిక
కవి కవికీ పోలిక
అనవసర అసందర్భ అసహన పోలిక
కార్యకారణం కావ్యకారణం
లేని నిరంకుశ పోలిక
నిష్కారణ పోలిక
తెలుపుకి నలుపుకీ
తేడా తెలిసినా
మళ్ళీ కొత్త పోలిక
మరో మెలిక
పనిదినానికి విశ్రాంతికీ
అవిశ్రాంతంగా ఆవిష్కృతమయ్యే
అర్థంలేని పోలిక
నిద్రపోనివ్వని మేలుకోని
మస్తిష్కంలో ప్రతిదీ పోలికే
ఓ కొలిక్కి ఎప్పుడూ రాలేని
పోలికేక లాంటి నిశ్శబ్ద పోలిక
ఎందుకో మరి
మనిషి బతికున్నంతవరకూ
చంపుతోందీ పోలిక!

– జంధ్యాల రఘుబాబు

# వైకాపా పాలనపై ప్రజలు తిరుగుబాటు: తెదేపా నాయకుడు కన్నబాబు



గోకవరం ప్రజా పాలన మార్చ్ 19: రాష్ట్రంలో జరిగినటువంటి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి చెంప చెంపపెట్టులా ఉన్నాదని తెదేపా సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్చార్జ్ కన్నబాబు అన్నారు. పట్టభద్రుల ఎన్నికలలో ఓట్లేసిన ప్రభుత్వ, పై తిరుగుబాటు నెలకొంది.ప్రైవేటు ఉద్యోగస్తులు, అదేవిధంగా వ్యవసాయ కుటుంబంనకు , వ్యాపారస్తులు కూడా ఉన్నారని, మరి ముఖ్యంగా నిరుద్యోగ యువత అధికంగా పాల్గొన్నారు కన్నబాబు అన్నారు. అధికార దుర్వినియోగమును ప్రశ్నించే ప్రతిపక్షంపైన, ప్రజలపైన దాడులను గ్రాడ్యుయేట్ లు గమనించారని,రాజధాని పేరుతో మూడు ముక్కలాట ను,ప్రభుత్వ అవినీతిని, రాష్ట్ర అధోగత పాలన , పెరిగి పోతున్న నిరుద్యోగసమస్య ను పట్టభద్రులు గుర్తించా రని కన్నబాబు తెలిపారు. వై కాపా అధికారం చేపట్టిన నాటినుండి ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప, అప్పులు తెచ్చి బటన్ నొక్కడం తప్ప ఈ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని. కన్నబాబు తెలిపారు. వైకాపా సెమీఫైనల్స్ గా భావించిన 9 జిల్లాల ఈ ఎలక్షన్లో 108 నియోజకవర్గాలలో కొన్ని లక్షల మంది ఓటర్లు పాల్గొనడం జరిగిందని, తెదేపా బలపరిచిన ఉత్తరాంధ్ర అభ్యర్థి లు వేపాడ. చిరంజీవిరావు, రాయలసీమ కంచర్ల.శ్రీకాంత్,భూమి రెడ్డి రామ్ గోపాల్ రెడ్డి లకు అత్యధిక మెజారిటీ ఇచ్చి ఈ దుర్మార్గపు వైకాపా నీ గద్దె దించాలని నిర్ణయించుకుని తెదేపాకి పట్టం కట్టారని కన్నబాబు తెలిపారు.రాజధాని పేరు చెప్పి ఎన్నో రాజకీయాలు చేశారని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర,రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టే కార్యక్రమాల అనేకం చేపట్టినా చివరకు పట్టభద్రులు వైకాపా భరతం పట్టారు. ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులు వెలుగెత్తి చాటారని. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పులివెందులలోనే ప్రజలు తిరుగుబాటు చేశారని, రానున్న కాలంలో తెదేపా అధికారం చేపట్టడం ఖాయమని కన్నబాబు తెలిపారు.

## మోహన్ బాబు 71వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపిన అభిమాన సంఘ అధ్యక్షులు తాతయ్య



తిరుపతి, ప్రజాపాలన ప్రతినిది: నటుడు మోహన్ బాబు గారి 71వ జన్మదిన వేడుకలు ఘనంగా మోహన్ బాబు అభిమాన సంఘ అధ్యక్షులు తాతయ్య నిర్వహించారు చౌడేపల్లి టౌన్ లో భారీగా కేక్ కట్ చేసి వచ్చిన అభిమానులందరికీ మిఠాయి పంచారు వెంటనే మోహన్ బాబు దగ్గరికి వెళ్లి మోహన్ బాబు చేతిల మీదగా చేపించి పెద్ద ఎత్తున జయహో మోహన్ బాబు అన్న అంటూ నినాదాలు ఇస్తూ అక్కడున్నటువంటి ప్రతి ఒక్కరికి కేక్ పంచారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది మోహన్ బాబు గారి జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహిస్తానని తెలియజేశారు

## టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ హౌస్ అరెస్ట్



రాజమహేంద్రవరం, ప్రజా పాలన ప్రతినిధి :భావ ప్రకటన స్వేచ్ఛను హరించే జీవో నెంబర్ ఒకటి రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. జీవో నెంబర్ ఒకటి రద్దు చేయాలని ప్రజాసంఘాలు రేపు చలో విజయవాడ పిలుపునిచ్చిన నేపథ్యంలో 149 సీఆర్.పి.సి నోటీసులు ఇచ్చి ఆయన్ను హౌస్ అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎప్పుడో 1861 నాటి బ్రిటిష్ వలస చట్టాన్ని వెలికి తీసి ర్యాలీలు, సభలను నిషేధిస్తూ విడుదల చేసిన జీవో నెంబర్ ఒకటి రద్దు చేయకపోతే ప్రజలే వైసిపి ప్రభుత్వాన్ని రద్దు చేస్తారని అన్నారు. త్వరలోనే అధికారాన్ని కోల్పోతామనే భయంతో వణికిపోతున్న వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల విజయం కంటిమీద కునుకు లేకుండా చేసిందన్నారు. చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనకుండా తెలుగుదేశం నాయకులను హౌస్ అరెస్టులు చేస్తున్న మీరు రేపు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయకుండా ప్రజలను ఆపగలరా అని ప్రశ్నించారు. రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో భయపడుతూ భయపెట్టే చీకటి జి.ఓ లతో కాకుండా ప్రజల సంపూర్ణ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిపాలనను నెలకొల్పుతామని అన్నారు.

## మామిడి తోటలను రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : బొర్రా వెంకట అప్పారావు



సత్తెనపల్లి ప్రజాపాలన పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజక వర్గం లోని రాజుపాలెం నకరికల్లు సత్తెనపల్లి ముప్పాళ్ళ మండలాలకు సంబంధించి శనివారం కురిసిన అకాల వర్షానికి మామిడి తోటలు మరియు మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నయని సత్తెనపల్లి జనసేన పార్టీ నాయకులు బొర్రా వెంకట అప్పారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో భాగంగా మాట్లాడుతూ రాజుపాలెం మండల పరిధిలోని అంచుల వారి పాలెం అనుపాలెం నకరికల్లు మండల పరిధిలోని పలు గ్రామాలలో నిన్న కురిసిన అకాల వర్షానికి మామిడి చెట్లు మొత్తం పూర్తిగా పడిపోయాయని కాయలు మొత్తం పూర్తిగా రాలిపోయాయని అలానే ఎకరానికి లక్ష రూపాయల నుండి రెండు లక్షల రూపాయలకు రైతులకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం వెంటనే స్పందించి మామిడి తోటలకు మరియు మొక్క జొన్న రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో అకాల వర్షానికి ఏమైనా గృహాలు దెబ్బతినుంటే వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం లో జనసేన పార్టీ ఎప్పుడు కూడా రైతులు మరియు ప్రజల సమస్యల పై ముందుంటుంది అన్నారు.

## బాలుడు వైద్యానికి గౌతమ్ స్కూల్ 55 వేల సాయం



గోకవరం ప్రజాపాలన మార్చ్ 19:మండల కేంద్రంలో గోకవరం పొట్నూరి సతీష్ దంపతులుకి రెండున్నర (సంవత్సరాలు) అక్షయ్ రామ్ కి అంతు బొన్ మేర్ వ్యాధితో బాధపడుతున్నాడు ఆపరేషన్ నిమిత్తం సుమారు 30 లక్షల ఖర్చు తమిళనాడు చెన్నై వేలూరు హాస్పిటల్ లో వైద్యం పొందుతున్న అక్షయ్ రామ్ చిన్నారికి సంబంధించి సోషల్ వీడియోలో చూసినా కాట్రావులపల్లి గౌతమ్ స్కూల్ స్టూడెంట్స్ టీచర్స్ మేనేజ్మెంట్ మొత్తం అందరూ కలిపి అక్షయ్ రామ్ వైద్య నిమిత్తం 55 వేల తండ్రికి అందజేశారు

## అకాల వర్షం అన్నదాతకు తీవ్ర నష్టం



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మార్చి 19 (ప్రజాపాలన ప్రతినిధి): అకాల వర్షంతో చేతికి అంది వచ్చిన పంటలను తీవ్రంగా నష్టపరిచింది.రొంపిచర్ల మండలం ఎడ్వర్డ్ పేట గ్రామంలో రాత్రి కురిసిన వాన,ఈదురుగాళ్లకు 100 ఎకరాల్లో మొక్కజొన్న పంట,గ్రామంలోని విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్ఫార్మర్లు,మోటర్ పంపు సెట్లు పూర్తిగా పాడైపోయాయిన్నారు.ఎడ్వర్డ్ పేట గ్రామంలో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు పర్యటించి నష్టపోయిన పంట వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు.వర్షం కారణంగా ధ్వంసమైన ముటుకూరి శ్రీనివాసరావు పూరి ఇల్లు పునర్నిర్మానానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు.రెండు ఎకరాల మొక్కజొన్న పూర్తిగా నేలమట్టమయిందని ఆవేదన చెందుతున్న పేద రైతు ఉమర్ అనే పేద రైతుకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.అనంతరం డా.చదలవాడ మాట్లాడుతూ....అకాల వర్షం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయి ఉంటే ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టకుండా మొద్దు నిద్రపోతుందని మండిపడ్డారు.నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవాలని,కరెంటు స్తంభాలను,ట్రాన్స్ఫారాలను విద్యుత్ శాఖ వారు వెంటనే పునరుద్ధరించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆరు నెలల క్రితం వర్షం కారణంగా పాడైపోయిన పంటలకు ఇప్పటికీ నష్ట పరిహారం అందించకపోవడం సిగ్గు చేటు అన్నారు.ఇప్పటికైనా ఆరుగాలం పండించి అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేకపోతే రైతుల పక్షాన ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధమని డా.చదలవాడ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కొలకాని సైదారవు,బ్రహ్మయ్య,నాగరాజు,అంజి,చాంద్ బాషా,ఆనందరావు,కొండలు,రామిరెడ్డి,కాశయ్య,కోటయ్య తదితరులు పాల్గొన్నారు.


## నూతన వ్యాపార ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన-డా.చదలవాడ చదలవాడ అరవింద బాబు



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మార్చి 19 (ప్రజా పాలన ప్రతినిధి): నరసరావుపేట పట్టణంలో క్లాత్ మార్కెట్ లోని విష్ణు తవ్వ ఫ్యాషన్,సాతులూరు గ్రామంలో బేకరీల నూతన వ్యాపార ప్రారంభోత్సవాలకు నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ...వ్యాపారాలు లాభాల బాటలో పయనించాలని కొనుగోలుదారులకు నాణ్యమైన వస్తువులు అందించి వ్యాపారస్తులు వినియోగదారుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.నాణ్యమైన వస్తు సేవలందించి సమాజంలో పేరు ప్రతిష్టలు సంపాదించే వ్యాపార సంస్థగా రాణించాలని వ్యాపారస్తులకు డా.చదలవాడ సూచించారు.ఈ కార్యక్రమంలో సినీ నటుడు శివమ్,టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్,సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య,బండారుపల్లి సత్యనారాయణ,చల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అసమర్ధ పాలన రాజ్యమేలుతుంది

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు**



నరసరావుపేట. మార్చి 19 (ప్రజాపాలన ప్రతినిధి): వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు విమర్శించారు.వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైసీపీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకుని,దాచుకోవడం తప్ప ఏ ఒక్క రంగాన్ని అభివృద్ధి చేయలేదని డా.చదలవాడ ఆవేదన వ్యక్తం చేశారు.నరసరావుపేట స్థానిక 25 వార్డు ఎన్జీవో కాలనీలో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయని ఈ ప్రభుత్వానికి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు.వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కూల్చడం,ధరలు పెంచడం,ఇచ్చిన పథకాలు రద్దు చేయడం తప్ప ఒక్క ప్రాజెక్టయినా పూర్తి చేసిందా అని ప్రశ్నించారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడును మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు.వైసీపీ అరాచకాలు,అక్రమాలను కర పత్రాలలో ప్రింట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్,కోట నాగ సుదీర్,జాష్టి బాబు,కనుమూరి నరసింహారావు,బ్రహ్మయ్య,బొట్ల నాగేశ్వరావు,గార్లపాటి ప్రసాద్,గార్లపాటి వెంకటేశ్వర్లు,కావూరి వెంకటేశ్వర్లు,కొండ్రగుంట వెంకటనారాయణ, వెంకట్రావు, మోహన్, కనుమూరి శ్రీను,కనుమూరి మోహన్రావు,కనుమూరి ఆంజనేయులు,రామారావు,తిరుమలకొండ గురవయ్య,తిరుమలకొండ నరసింహారావు,నాగజ్యోతి,రాధిక తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్



తిరువూరు మార్చ్ 19 ప్రజా పాలన ప్రతినిధి:ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి , జిల్లా కలెక్టర్, సహచర ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ లతో కలిసి శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ గా అనురాధ విజయం తధ్యం..: మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్ (ప్రజాపాలన మార్చ్ 19: రాబోయే శాసనసభ్యుల ఎమ్మెల్సీ స్థానం నుండి నుండి కూడా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ విజయం తధ్యం అని కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం టి.డి.పి. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి అభ్యర్థుల విజయాన్ని పురస్కరించుకొని ఆదివారం మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి టి.డి.పి. కార్యాలయంలో విజయోత్సవాన్ని ఏర్పాటు చేసి సంబరాలు జరిపారు. చిరంజీవి, శ్రీకాంత్, భూమి రెడ్డి రామ్ గోపాల రెడ్డి ల విజయం వై.సి.పి. కి చెంప పెట్టని రవీంద్ర అన్నారు. ఈ విజయం 108 నియోజక వర్గాల ప్రజా తీర్పు అని రవీంద్ర అన్నారు.ఉత్తరాంధ్ర ,రాయల సీమ ప్రజలు మూడు రాజధానులు కోరుకోవడం లేదని రవీంద్ర అన్నారు. ఈ ప్రజా తీర్పు కి వై.సి.పి.నేతల మతి పోయిందన్నారు. 7, 10 వ తరగతి చదువుకున్న వారిని గ్రాడ్యుయేట్ ఎన్నికల జాబితాలో చేర్చడం సిగ్గు చేటని రవీంద్ర ఘాటుగా విమర్శించారు. పంచుమర్తి అనూరాధ బి.సి.వర్గానికి చెందిన చేనేత వర్గానికి చెందిన మృదుస్వభావిని అని గతంలో నగర మేయర్ గా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి అని ఆమె గెలుపు ని ఎవ్వరూ ఆపలేరు అని కొల్లు రవీంద్ర అన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఫలితాల విషయంలో అధికార పార్టీ అనుచిత చర్యలకు దిగిందని టిడిపి అభ్యర్థి గెలిచినప్పటికీ డిక్లరేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా వ్యవహరించిందని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో వైఎస్ఆర్సిపిని ప్రజలు రోడ్డు మీద తిరగనివ్వని రోజులు వస్తున్నాయని ఈ గెలుపుతో టి.డి.పి.పై ప్రజలు మొగ్గు చూపుతున్నారు అని అర్థం అవుతోందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు నిస్వార్థంగా పనిచేయాలని కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎం.ఎల్.సి.ఎన్నికల్లో విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపు సత్యనారాయణ, ఇలియానా పాషా, పిప్పళ్ల వెంకన్న, లంకిసెట్టి నీరజ ,పెద్ద ఎత్తున టి.డి.పి. శ్రేణులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులను వెంటనే ఆదుకోవాలి: మాజీ ఎమ్మెల్యేశ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట మార్చి 19 ప్రజా పాలన ప్రతినిధి: నియో జకవర్గపరిధిలో వత్సవాయి మండలం %డ% వత్సవాయి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు రైతులతో కలిసి అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పరిశీలిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనియో జకవర్గంలో 6 వేల ఎకరాల మొక్కజొన్న రైతులు సా గు చేశారు ఈ సీజన్లోనే ప్రత్తి, మిర్చి దెబ్బ తినడంతో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు ఈ పం ట ద్వారానైనా ఆదాయం వస్తుందని రైతులు ఆశిం చారు కానీ అకాల వర్షాల వల్ల ఈదురు గాలులకు ని యోజకవర్గంలో మొక్కజొన్న మొత్తం నేలకు పడిపో యింది రైతులు తీవ్రంగా నష్టపోయారు.ప్రభుత్వం వెం టనే స్పందించి ఎదైతే పంట నష్టం జరిగిందో అంచనా లు తాయారు చేసి ఆ రైతులకి నష్ట పరిహారం అందించిరైతులనిఆదుకోవాలన్నారు. ఈవిషయంపైప్రభత్వం స్పందించకుంటే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రై తుల తరుపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలు గుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు తెలు గుదేశం పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్ సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించిన చిరుత.. తర్వాత ఏం జరిగిందంటే!

శ్రీనగర్: ఒక చిరుత పాకిస్థాన్ సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించింది. గమనించిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) స్థానిక గ్రామస్తులను అప్రమత్తం చేశారు. జమ్ముకశ్మీర్‌లోని సాంబా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం ఉదయం ఒక చిరుత రామ్‌గఢ్ సబ్ సెక్టార్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఉన్న ఫెన్సింగ్‌ను దాటి భారత్ భూభాగంలోకి ప్రవేశించింది. బీఎస్ఎఫ్ సిబ్బంది దీనిని గమనించారు. సరిహద్దు సమీపంలోని స్థానికులను అలెర్ట్ చేశారు. ఆ చిరుత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# వైసీపికి డేంజర్ బెల్స్..!



విజయవాడ, మార్చి 19,:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ రాజకీయవర్గాలు చాలా ఆసక్తిగా ఎదురు చూశాయి. దీనికి కారణం ప్రజా నాడి ఎలా ఉందో నేరుగా ఓట్ల రూపంలో తెలుసుకునే ఓ అవకాశం రావడమే. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయా పార్టీల ఓటర్లు ఓట్లు వేస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు చాలా పరిమితం. కానీ పట్టభద్రుల ఓటర్లు మాత్రం లక్షల్లో ఉంటారు. మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి దాదాపుగా పది లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. అంటే ప్రజాభిప్రాయాన్ని ఓ రకంగా అంచనా వేయవచ్చు. అందుకే అందరూ ఈ ఫలితాలపై ఆసక్తిగా ఎదురు చూశారు. చివరికి వైఎస్ఆర్‌సీపీకి షాక్ తగిలింది. రెండు స్థానాల్లో అసలు పోటీ ఇవ్వలేకపోగా కంచుకోట లాంటి స్థానంలో తావే గట్టి పోటీ ఎదుర్కోవాల్సి వచ్చింది. అన్ని చోట్లా గెలుస్తామని కేబినెట్ భేటీలో ముందస్తుగానే మంత్రుల్ని సీఎం జగన్ అభినందించారు. కానీ జరిగింది మాత్రం వేరు. ఉత్తరాంధ్రపై ఈ సారి వైఎస్ఆర్‌సీపీ చాలా ఎక్కువ ఆశలు పెట్టుకుంది. దానికి కారణం తాము రాజధానిని విశాఖ తీసుకు వస్తున్నామని అక్కడి ప్రజలు తమకు బ్రహ్మరథం పడతారని అనుకోవడమే. అలా అని ఊరుకోలేదు. ఆరు నెలల ముందుగానే అభ్యర్థిని ప్రకటించారు. ఓట్ల నమోదు దగ్గర్నుంచి అన్ని విషయాల్లోనూ కేర్ తీసుకుంది. చివరికి ప్రచారంలోనూ మంత్రులు అంతా తామై వ్యవహరించారు. మంత్రి ధర్మాన ఎక్కడ పట్టభద్రుల ఎన్నికల మిటింగ్ పెట్టినా... వైఎస్ఆర్‌సీపీకి ఓటేయకపోతే విశాఖ రాజధాని డిమాండ్‌ను బలహీనపర్చడమేనని సెంటిమెంట్ వాడే ప్రయత్నం చేశారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా పట్టభద్రులైన ఓటర్లు మాత్రం పట్టించుకోలేదు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావుకే భారీ మెజార్టీ ఇచ్చారు. నిజానికి తెలుగుదేశం పార్టీ ఇక్కడ మొదట గాడు చిన్నికుమారి అనే నేతను అభ్యర్థిగా ప్రకటించింది. కానీ ఆమె బలహీన అభ్యర్థి అని నిర్ణయించుకుని ఫిబ్రవరిలోనే అభ్యర్థిగా ఎకానమీ చిరంజీవిగా ఎంతో మంది గ్రాడ్యుయేట్లకు పరిచయమున్న వేపాడ చిరంజీవి రావును అభ్యర్థిగా ఖరారు చేశారు. ఆయన ఇతర టీడీపీ నేతల కృషితో విస్తృతంగా పర్యటించారు. మంచి ఫలితం సాధించారు. వైఎస్ఆర్‌సీపీ గెలుపొందడటానికి చేయని ప్రయత్నాలు లేవు. వెండి బిస్కెట్లు పంచారని కూడా ఆరోపణలు వచ్చాయి. ఇక విజయసాయిరెడ్డి నుంచి ఉత్తరాంధ్ర బాద్యతలు తీసుకున్న వైవీ సుబ్బారెడ్డి మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎమ్మెల్సీ ఓడిపోతే రాజధాని వాదన బలహీనపడుతుందన్న అభిప్రాయంతో చేయాల్సినంత చేశారు. కానీ.. ఫలితం ఏ మాత్రం అనుకూలంగా రాలే?దు. ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీకి ఈ అంశంపై సమీక్ష చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ఎందుకంటే.. అమరావతిని కాదని అక్కడ వ్యతిరేకత మూట గట్టుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు విశాఖలో కూడా సానుకూలత లేకపోతే రెంటికి చెడ్డ రేవడి అయిపోతుంది పరిస్థితి. వైఎస్ఆర్‌సీపీ తన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యూహంలో మార్పులు చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక తెచ్చి పెట్టిందనుకోవచ్చు. ఒక్క ఉత్తరాంధ్రలోనే కాదు తూర్పు రాయలసీమలోనూ వైఎస్ఆర్‌సీపీకి గడ్డు పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పరిధిలోని గ్రాడ్యుయేట్ ఓటర్లు పూర్తి స్థాయిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ కు మద్దతుగా నిలిచారు. నిజానికి నెల్లూరు వైఎస్ఆర్‌సీపీ కంచుకోట. చిత్తూరులో అయితే పెద్దిరెడ్డి లాంటి నేత ఉన్నారు. ఆయన ఏ ఎన్నిక జరిగినా పట్టు బిగిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోనూ మెజార్టీ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలే. పైగా మూడు రాజధానుల పేరుతో తిరుపితలోనూ గర్జన నిర్వహించారు. అయితే ఇక్కడ కూడా వైఎస్ఆర్పీసీకి ఇబ్బందికర పరిస్థితులు తప్పలేదు. రాజధానిగా విశాఖ వాదనకు.. తూర్పురాయలసీమ ప్రజలు కూడా సంతృప్తిగా లేరు. అమరావతి అయితే సమీపంలోనే ఉంటుందని.. విశాఖ అయితే ఎలా ఉన్న అభిప్రాయం సామాన్య జనాల్లో ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ప్రకాశం , నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. వెలిగొండ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టిన జగన్ ప్రభుత్వం తాము వచ్చాక జరుగుతున్న పనుల్ని నిలిపివేసి.. రివర్స్ టెండరింగ్ ద్వారా ఇతరులకు పనులు ఇచ్చారు కానీ అసలు ముందుకు సాగలేదు. ఇలాంటివి మూడు జిల్లాల్లో ఉన్నాయి. అదే సమయంలో నిరుద్యోగ సమస్య కూడా యువతను ఆలోచింప చేసినట్లుగా అనుకోవచ్చు. అందుకే.. గట్టి పట్టు ఉన్న ప్రాంతంగా పేరున్న జిల్లాల్లోనూ వైఎస్ఆర్‌సీపీకి ఎదురు గాలి వీచిందని నమ్ముతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఈ సమస్యలపై సమీక్ష చేసి.. పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితుల్ని గ్రాడ్యుయేట్లు తమ ఓటింగ్ ద్వారా గుర్తు చేశారని అనుకోవచ్చు. పశ్చిమరాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఉన్న జిల్లాలు కడప, కర్నూలు, అనంతపురం. ఈ మూడు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ పట్టు గురించి చెప్పాల్సిన పని లేదు. మూడు జిల్లాలకు కలిపి టీడీపీకి ఉన్నది ఇద్దరే ఇద్దరు ఎమ్మెల్యేలు. వారు కూడా అనంతపురం జిల్లా నుంచే ఉన్నారు. అంటే ఏకపక్షంగా పట్టభద్రులు ఓటింగ్ చేయాల్సిన నియోజకవర్గం. కానీ హోరాహోరీ పోరు జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గట్టి పోటీ చేస్తున్నారు. అన్ని రౌండ్లలోనూ వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థికి మెజార్టీ వచ్చినప్పటికి అది డబుల్ డిజిట్స్ లోనే ఉంటుంది. అందుకే ఓవరాల్ మెజార్టీ రెండు వేలకు దాటడం లేదు. పీడీఎఫ్ అభ్యర్థులతో టీడీపీ వచ్చిన అవగాహన మేరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లు.. టీడీపీ అభ్యర్థికి వేసిఉంటే.. ఇక్కడ వైఎస్ఆర్‌సీపీ షాక్ తినొచ్చు. అదే జరిగితే.. వైఎస్ఆర్‌సీపీ కంచుకోట కూలినట్లవుతుంది. అది వైఎస్ఆర్‌సీపీ ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తాము ప్రజా రంజకంగా పరిపాలిస్తున్నామన్న ఓ రకమైన అభిప్రాయంలో ఉంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తెలుసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదని తాజా ఎమ్మెల్సీ పరిణామాలతో అర్థమైపోతుంది. ఇప్పటి వరకూ ప్రత్యక్షంగా జరిగిన ఎన్నికల్లో ఇలాంటి అనుభవం ఎదురు కాలేదు కాబట్టి.. అలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని అనుకోవచ్చు. మరి ఇప్పుడైనా ప్రభుత్వం ఈ విషయంలో సీరియస్‌గా ఉంటుందా అన్నది ఆసక్తికర అంశం. ప్రత్యర్థులపై రాజకీయ దాడులు ఆపి ప్రజలకు అత్యధిక సమయం కేటాయించాలన్న విశ్లేషణ ఎక్కువగా వినిపిస్తోంది. ఎందుకంటే రాజకీయ ప్రత్యర్థుల్ని టార్గెట్ చేస్తే.. అది వారికి బలం ఇస్తుంది. కానీ టార్గెట్ చేసిన వారికి మైనస్ అవుతుంది. ఎన్నికలకు ఇంకా ఏడాది కూడా లేని సమయంలో.. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సమీక్షించుకుని.. లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాల్సిన అవసరం అధికార పార్టీపై పడిందని అనుకోవచ్చు.

## బీజేపీ ఆశలన్నీ అడియాసలేనా..?



విజయవాడ, మార్చి 19, :ఆంధ్రప్రదేశ్‌లో బలపడాలన్న బీజేపీ పెద్దల ఆశలన్నీ అడియాసలే అవుతున్నాయి. రోజు రోజుకు బీజేపీ బలపడాల్సింది పోయి బలహీనపడుతుంది. అంతేకాదు పార్టీకి చెందిన కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీ వీడటం మైనస్ అయితే మిగిలిన వారు వర్గపోరుతో పార్టీకి చేటు తెస్తున్నారు. అంతేకాదు బీజేపీని ఒక తాటిపైకి తీసుకువచ్చే నాయకత్వం లోపించింది అని ఆ పార్టీ నేతలే బాహటంగా చెబుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి అంతా కేంద్రం నిధులతోనేనని చెప్పుకుంటున్న బీజేపీ దాన్ని ప్రజల్లోకి చేరవేయడంలో విఫలమవుతుంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను పట్టించుకోకపోవడం అనేది ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. దీంతో ప్రజలు బీజేపీపై గుర్రుగా ఉన్నారు. ప్రజల్లో ఉన్న ఆ వ్యతిరేకతను తొలగించేందుకు కనీసం బీజేపీ నేతలు ప్రయత్నించడం లేదనే విమర్శలు సైతం ఉన్నాయి. కనీసం స్టార్ కాంపైనర్ కూడా లేరని పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. దీని ఫలితంగా ఎన్నికలు ఏవైనా బీజేపీకి ఫలితాలు రివర్స్ అవుతున్నాయి.ఇదిలా ఉంటే 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఘోరంగా ఓటమి పాలైంది. అనంతరం జరిగిన స్థానిక సంస్థలు, పరిషత్, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ చావుతప్పి కన్నులొట్టబోయిన పరిస్థితి నెలకొంది. ఇంకా చెప్పాలంటే ఎన్నిక ఏదైనా బీజేపీ ముంగిట ఓటమి స్వాగతం పలకాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే తాజాగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగింది. తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగింది. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీకి చెందిన రాష్ట్ర నేతలు ప్రయత్నించారు. కేంద్రం పెద్దలు వచ్చినా కానీ అంత ఫేమ్ ఉన్న నేతలు కాకపోవడంతో పట్టభద్రులను ఆకట్టుకోలేకపోయారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్ల కంటే తక్కువ ఓట్లకే పరిమితమయ్యారు. అంటే దాదాపు డిపాజిట్ కోల్పోయారన్నమాట. ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఈసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి దారుణమైన ఓటమి చవిచూశారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీవీఎన్ మాధవ్ గెలుపొందారు. అయితే ఈసారి డిపాజిట్ సైతం కోల్పోవడంతో బీజేపీ పరిస్థితి దయనీయంగా మారింది.ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌కి డిపాజిట్ కూడా దక్కకపోవడం వెనుక విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశం తీవ్ర ప్రభావం చూపిందని తెలుస్తోంది. కనీసం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని ఓట్లుకూడా కలిసిరాలేదు. అంతేకాదు విశాఖ రైల్వే జోన్, విభజన హామీలు అమలు చేయకపోవడంపై పట్టభద్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, రైల్వే జోన్ విషయంలో దాగుడుమూతలు ఆడటం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకపోవడం ఇలా అనేక అంశాలు యువతను ఆలోచింపజేశాయని తెలుస్తోంది. ఉత్తరాంధ్రలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, రైల్వేజోన్ అంశం బీజేపీని దెబ్బతీస్తే ఇక రాయలసీమ ప్రాంతాల్లో విభజన హామీలు అమలు చేయకపోవడం ఓట్లను దూరం చేసుకుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

## అరకొర సేవలతో సర్కారీ ఆసుపత్రి

రాజమండ్రి, మార్చి 18, :సాధారణంగా ప్రభుత్వాసుపత్రి అంటే అంతా ఫ్రీగా జరుగుతాయని అనుకుంటారు. కానీ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. చాలీచాలని మందులు, అరకొర సేవలతో పేదలు అల్లాడిపోతున్నారు. దాదాపుగా మందులన్నీ రోగులు బయట కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సర్జరీ చేయించుకోవడానికి ఎవరైనా వస్తే అందుకు అవసరమైన సామాగ్రి అంతా రోగి కుటుంబీకులు తెచ్చుకోవాల్సిందే. పిఠాపురం పట్టణంతోపాటు, దాదాపుగా చుట్టుకపక్కల ఉన్న 10 గ్రామాలకు ఇదే పెద్దాసుపత్రి.పిఠాపురం, పెద్దాపురం పురపాలక సంఘాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా వీటి పరిధిలో జాతీయ రహదారులు ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బాధితులకు అత్యవసర చికిత్స అందించాల్సి ఉన్నా, 108 వాహనం రాకపోతే ఇక నరకమే. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వ అంబులెన్సులు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అందుబాటులో ఉంచారు. ఈ వాహనాలకు గతంలో డ్రైవర్లను కూడా నియమించారు. కానీ సదరు వాహనం మూలకు చేరడంతో సమస్య మొదటికొచ్చింది. పిఠాపురం పరిసర ప్రాంతంలో పెద్ద ప్రమాదంతో జరిగితే ఆసుపత్రి బయట ఉండే ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. పిఠాపురం నుంచి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న కాకినాడలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లాలంటే రూ. 2. వేల నుంచి రూ. 5 వేల వరకూ కిరాయి తీసుకుంటున్నారు.ప్రభుత్వం నుంచి మందులు సరఫరా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జ్వరం, గ్యాస్ట్రిక్ మాత్రలు, ఇతరనొప్పుల మాత్రలు తప్పితే, మిగతా రోగాలకు సంబంధించి అవసరమైన మందులు అందుబాటులో లేవు. చేసేది లేక వైద్యులు కొన్ని మాత్రలు బయట తీసుకోవాలని సూచిస్తున్నారు. నిరుపేదలకు మందులను బయటే కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక శస్త్రచికిత్సలకైతే అవసరమైన కిట్లు కూడా బయట తీసుకుంటున్నామని రోగులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో ఆసుపత్రి వచ్చే రోగులకు అన్ని బయట మందుల షాపులపైనే ఆధారపడాల్సి వస్తుంది. రక్తపరీక్షలను ప్రైవేటు లేబొరేటరీలపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొని ఉంది.

## వివేకా దర్యాప్తు కేసులో జాప్యం ఎందుకు..?

కడప, మార్చి 18, :వివేకా హత్య కేసు దర్యాప్తు జగుతున్న తీరు..చేరుకుంటున్న ముగింపు దిశ చూస్తే.. ఈ కేసులో సూత్ర ధారులు, పాత్రధారుల పాత్ర అతి తొందరలోనే వెల్లడయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ఎవరైనా భావిస్తారు. ఈ పరిస్థితుల్లో కేసు దర్యాప్తును అడ్డుకోవడానికి ఎవరు ఏ విధంగా ప్రయత్నించినా.. వారిపై అనుమానాలు వెల్లువెత్తడం ఖాయం.సరిగ్గా అదే జరుగుతోంది ఇప్పుడు వివేకా హత్య కేసు విషయంలో.. ఈ కేసు దర్యాప్తు సజావుగా సాగకుండా సాధ్యమైనంత వరకూ జాప్యం జరిగేలా చూడటమే లక్ష్యంగా జరుగుతున్న ప్రయత్నాలు అటువంటి అనుమానాలకే ఆస్కారం కలిగిస్తున్నాయి. అలా ప్రయత్నిస్తున్నవారే ఈ కేసులో దోషులు అన్న నిర్ధారణకు జనం వచ్చేందుకు ఆ ప్రయత్నాలే ఆస్కారం కలిగిస్తున్నాయి.టెక్నికల్ గా కేసులు, పిటిషన్లతో దర్యాప్తు ముందుకు సాగకుండా అడ్డుకుంటూ.. జనం దృష్టిలో పలుచన అవ్వడమే కాకుండా.. నేరం చేసినట్లుగా ప్రజలు నమ్మడానికి వారి ప్రయత్నాలు ఆస్కారం కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా ప్రస్తుతం సీబీఐ విచారణను ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వేసిన పిటిషన్లు చాలవా అన్నట్లు.. హతుడు వైఎస్ వివేకా వద్ద పిఏగా పని చేసిన కృష్ణారెడ్డి కూడా హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆయన తన పిటిషన్ లో వైఎస్ వివేకా హత్య ఆస్తుల కోసమే జరిగి ఉంటుందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యూహమే జగన్ అక్రమాస్తుల కేసు విషయంలోనూ అనుసరించిన విషయాన్ని ఈ సందర్భంగా పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఒకరి తరువాత ఒకరు అన్నట్లుగా పెద్ద సంఖ్యలో కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తూ కేసు దర్యాప్తు, విచారణ ముందుకు సాగకుండా అడ్డుకోవడమే లక్ష్యం అన్నట్లుగా సాగుతోంది.

## కోనసీమలో నీటి ఎద్దడి

కాకినాడ, మార్చి 19, :ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాళ్వా పంట సాగునీరు లేక ఎండిపోతున్న పరిస్థితి తలెత్తింది. ఈ పరిస్థితి డెల్టా ప్రాంతంలో మరీ దారుణంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో చాలా ఆయకట్టులోని వరిచేలు సాగునీరు అందక బీడుబారుతున్నాయి. దీంతో రైతులు అనేకసార్లు అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోకపోవడంతో రైతులు నిరసన బాట పడుతున్నారు. ఈ క్రమంలోనే అమలాపురం రూరల్ మండలంలోని జనుపల్లి, వేమవరం తదితర గ్రామాల్లోని థైలాండ్ ప్రాంతంలో చేలు చాలావరకు ఎండిపోయి బీటలు వారడంతో ఆగ్రహించిన పలువురు రైతులు పొలాల్లో మోటారు సైకిళ్లు నడిపి తమ నిరసన తెలిపారు. అధికారులను ఆ ప్రాంతానికి పిలిచి చేలను చూపించి సాగునీరందక పోవడంతో నిలదీశారు. నీరు అందితే చేలు పనిచేస్తాయని పాడుచేసుకోవద్దని హితవు పలికినా రైతులు వినిపించుకోలేదు. ఇక మేము పడలేం అంటూ చేలో మోటారు సైకిళ్లు నడిపి తమ నిరసన తెలిపారు. పి.గన్నవరం నియోజకవర్గంతో పాటు, అమలాపురం గ్రామీణ మండలంలో పలు చోట్ల రైతులు ఇదే తరహా నిరసనలు చేస్తున్నారు.గోదావరి డెల్టా ప్రాంతంలో సాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఈనేపథ్యంలో శివారు ప్రాంతాల్లో ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటికే వంతులవారీ విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అమలు చేస్తున్నారు. సెంట్రల్ డెల్టాలోని మూడు ప్రధాన పంటకాలువల ద్వారా వంతుల వారీగా సాగునీటి, తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు అధికారులు. అయితే పలుప్రాంతాల్లో డ్రైయిన్లు, పంటకాల్వలు అధ్వాన్న పరిస్థితిలో ఉండడంతో కాలువల్లో నీరు చాలాచోట్ల వృథాగా పోతోంది. ఇది గమనించిన అధికారులు యుద్ధప్రాతిపదికన 87 చోట్ల నాలుగు ప్రధాన డ్రైన్లకు క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేసి అటు సముద్రం నీరు పోటెత్తకుండా ఇటు పంటకాలవుల్లోని సాగునీరు సముద్రంలోకి వృథాగా పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ డ్రైన్లు, పంటకాలువల వ్యవస్థ దెబ్బతినడంతో చాలా సాగునీరు వృథాపోతుందంటున్నారు. ఇదిలా ఉంటే సాగునీరు చౌర్యానికి గురవుతోంది. ఆక్వారంగం బాగా పెరిగిపోవడంతో చెరువుల్లో ఉప్పునీటి సాంద్రతను తగ్గించుకునేందుకు పంటకాలువల్లో ఇంజిన్లు పెట్టి నీటి చౌర్యాన్ని చేస్తున్నారు. దీంతో వ్యవసాయానికి సాగునీరు అక్కరకు రాకుండా పోతోంది.వాతావరణ శాఖ ప్రకటించినట్లే ఉమ్మడి



తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా చెదురుమొదురు వర్షాలు కురుస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో పలు చోట్ల శుక్రవారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎండిపోయిన పొలాల్లో మోటారు సైకిళ్లతో పంటను ధ్వంసం చేసుకున్న రైతులు మాత్రం తాము చేసిన పనిని సమర్థించుకుంటున్నారు. రబీ సాగుకు సాగునీటి కష్టాలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. చాలా చోట్ల వరి చేలు బీటలువారుతున్నాయి. పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. నీటి కష్టాలు నివారించేందుకు అధికారులు చేపట్టిన చర్యలు ఫలించడంలేదు. కొన్నిరోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దాళ్వా సాగుకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలో రబీ సీజన్‌లో 1.90 లక్షల ఎకరాల్లో వరిసాగు సేద్యం చేశారు. గతంలో తొలకరి పంటను త్యాగం చేసిన రైతులు రబీ పంట సేద్యం చేస్తున్నప్పటికీ పరిస్థితులు చూస్తుంటే ఈ పంటను కూడా కోల్పోయేలా ఉందని రైతుల ఆవేదన చెందుతునన్నారు. జిల్లా వ్యాప్తంగా 69 గ్రామాల్లో 5287 ఎకరాల విస్తీర్ణంలో సాగునీటి సమస్యలు తలెత్తినట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీటి నివారణకు సమీప ప్రాంతాల్లో డ్రైన్లపై క్రాస్‌బండ్‌లు వేసి రైతులకు సాగు నీటిని ఇంజిన్ల ద్వారా మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. అమలాపురం సబ్‌డివిజన్‌లో 63, రాజోలు సబ్‌డివిజన్‌లో 9, రామచంద్రపురం సబ్‌డివిజన్‌లో 18 క్రాస్‌బండ్‌లు ఏర్పాటుచేసి డ్రైన్లలో నీటిని ఎత్తిపోతల ద్వారా కాల్వ చిట్టచివరి భూములకు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా స్పష్టం చేశారు.

# భారీగా ఆయుధాలు దిగుమతేనా.. ఆత్మనిర్భరం

మనకు లభించే ముడిపదార్థాలతోనే స్వయం సమృద్ధి సాధిస్తున్నామని 'ఆత్మనిర్భరత' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పక్క ప్రచారం చేస్తోంది. భారత దేశం మరో పక్క ఆయుధాల దిగుమతిలో ప్రపంచంలోనే అగ్రస్థానం లో ఉంది. ప్రపంచ దిగుమతుల్లో 2017-22 మధ్య భారత దేశం వాటా 11 శాతంగా కొనసాగుతోందని స్టాక్ హోమ్?లోని అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ (ఎస్ఐపిఆర్ఐ) తాజా నివేదిక వెల్లడించింది. ఈ ఆయుధాల దిగుమతి 2013-17 మధ్య 12 శాతం ఉండగా 2018-23 మధ్య 11 శాతానికి స్వల్పంగా తగ్గిందని అంతర్జాతీయ ఆయుధాల మార్పు ధోరణుల గురించి 2023 మార్చిలో విడుదల చేసిన ఆ నివేదికలో పేర్కొంది. రక్షణ పరికరాల ఎగుమతిలో భారత దేశ వాటా కేవలం 0.2 శాతమని భారత రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపినట్టు అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ గత ఏడాది విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఇప్పుడది ఇంకా తగ్గింది. గత నెలలో బెంగళూరులో జరిగిన ఏరో ఇండియా 2023 సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతి 1.5 బిలియన్ డాలర్ల నుంచి 2024 25 నాటికి 5 బిలియన్ డాలర్లకు పెంచనున్నట్టు చెప్పారు. దేశాల మధ్య ఘర్షణలు, అంతర్జాతీయ ఆయుధ వ్యాపారం, సైన్యం, రక్షణకు సంబంధించిన విషయాల గురించిన పరిశోధనలో 'అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ' ప్రసిద్ధి చెందింది. భారతదేశం 1992 -2022 మధ్య అంతర్జాతీయంగా ఆయుధాల దిగుమతి భారాన్ని ప్రపంచంలో అన్ని దేశాల కంటే ఎక్కువగా భరిస్తోందని ఈ సంస్థ పేర్కొంది. 'భారత దేశానికి చైనా, పాకిస్థానతో ఉన్న ఉద్రిక్తతల వల్ల ఈ ఆయుధా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది' అని ఆ సంస్థ పేర్కొంది. భారత దేశానికి రక్షణ ఉత్పత్తుల సామాగ్రిని 2013 -22 మధ్య రష్యానే ఎక్కువగా సమకూర్చినప్పటికీ, ఈ దశాబ్దంలో 65 శాతం నుంచి 45 శాతానికి తగ్గింది. యుక్రెయిన్ యుద్ధం వల్ల రష్యాపైన అంతర్జాతీయంగా విధించిన ఆంక్షలతో అక్కడ నుంచి దిగుమతులు ఈ మేరకు తగ్గాయి. పాకిస్థాన్ తన ఆయు?ధాల ఎగుమతిని 2013- 17, 2018-22 కాలానికి 14 శాతం పెంచుకుని ప్రపంచ ఎగుమతుల్లో 3.7 శాతం వాటాను సంపాదించింది. 'అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ' నివేదిక ప్రకారం 201822 కాలానికి పాకిస్థాన్ దిగుమతి చేసుకునే ఆయుధాల్లో 77 శాతం చైనా నుంచే వస్తున్నాయి. ఆయుధాల ఎగుమతిలో అంతర్జాతీయంగా 40 శాతం వాటా అమెరికాదే. అమెరికా ఇదివరకటి కంటే 14 శాతం ఎక్కువ ఆయుధ ఎగుమతులను పెంచుకుంది. ఈ కాలానికి ఫ్రాన్స్ఎగుమతులు 44 శాతం పెంచుకోగా, రష్యా (31శాతం), చైనా (23 శాతం), జర్మనీ (35 శాతం) ఆయుధాల ఎగుమతులు తగ్గాయి. 2013-17తో పోల్చుకుంటే, 2018-22 కాలానికి ప్రపంచ ఆయుధాల ఎగుమతిలో అమెరికా, ఫ్రాన్స్ కలిపి 51 శాతంతో అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ నివేదిక ప్రకారం 2022లో ప్రపంచంలో అత్యధికంగా ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల జాబితాలో భారత్, ఖతార్ తరువాత 2 శాతంతో ఉక్రెయిన్ మూడవ స్థానంలో నిలబడింది. గత ఏడాది ఫిబ్రవరిలో మొదలైన ఉక్రెయిన్ యుద్ధంతో ఆ దేశానికి ఆయుధాలు ఎగుమతి చేసే 29 దేశాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఉక్రెయిన్ ఆయుధ సంపత్తిని పెంచే దేశాల్లో పోలెండ్ 17 శాతం, జర్మనీ 11 శాతం, బ్రిటన్ 10 శాతం, సెజ్ రిపబ్లిక్ 4.4 శాతం ఆయుధాలను ఎగుమతి చేస్తున్నాయి. భారత రక్షణ పరికరాల దిగుమతి 2018- 19 మధ్య ఉన్న 46 శాతం నుంచి 2022 నాటికి 36.7 శాతానికి తగ్గిందని ఈ నెల 13వ తేదీ రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ రాజ్యసభలో రాతపూర్వకంగా వెల్లడించారు. భారత దేశం ఇప్పటికీ రక్షణ రంగ పరికరాల దిగుమతిలో అగ్రస్థానంలోనే ఉన్నప్పటికీ, స్థానికంగా దొరికే సామాగ్రితోనే రక్షణ రంగ ఉత్పత్తులను చేపడుతున్నామని 'ఆత్మనిర్భర భారత్' అన్న నినాదం కోసం దిగుమతులను తగ్గించి చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మిలిటరీ రిటైర్డ్ అధికారులు మాత్రం అంటున్నారు. భారత వైమానికి దళం కోసం 114 కంబాట్ ఎయిర్క్రాఫ్ట్లు, కొత్తగా భారత నౌకాదళంలో చేరిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కోసం మరో 26 కంబాట్ ఎయిర్క్రాఫ్ట్ల కొనుగోలు కోసం 45 బిలియన్ డాలర్లు వెచ్చించిందని రిటైర్డ్ బ్రిగేడియర్ రాహుల్ భోంస్లే చెప్పారు. వీరు ఢిల్లీలోని సెక్యూరిటీ రిస్క్ కన్సల్టెన్సీగా ఉన్నారు. త్రివిధ దళాలకు కలిపి ఆయుధాలు కలిగిన సాధారణ ఏరోనాటిక్ సిస్టం (జిఎఎస్ఐ) 18, ఎంక్యూ 9బి అనే మానవ రహిత సముద్ర రక్షణ వైమానిక వాహనాలు 30 వరకు దిగుమతి చేసుకోవడం ద్వారా ప్రపంచంలో అతి పెద్ద రక్షణ ఉత్పత్తుల దిగుమతి దేశంగా భారత దేశం కొనసాగుతోందని రిటైర్డ్ బ్రిగేడియర్ రాహుల్ భోంస్లే తెలిపారు. 'రక్షణ అవసరాల్లో స్వయం పోషకత్వం సాధించడానికి వాస్తవిక దృష్టితో దీర్ఘకాలికంగా రక్షణ పరికరాల దిగుమతి చేసుకోవడం అవసరం' అని ఆయన పేర్కొన్నారు. కొన్ని పరికరాలను, 410 ప్లాట్ఫారాల దిగుమతులపై 2020 నుంచి నిషేధం విధించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. 'ఆత్మనిర్భర భారత్' అన్న మాటను ప్రచారం చేసుకోవడానికి ఇలా త్రివిధ దళాల అధికారులు, రక్షణ శాఖ అధికారులు ఆడంబరంగా ప్రకటించుకుంటున్నారని రిటైర్డ్ మూడు నక్షత్రాల భారత వైమానికి అధికారి ఒకరు భిన్నంగా వ్యాఖ్యానించారు. 'ఆత్మనిర్భర భారత్' నినాదం రాజుగారి దేవతా వస్త్రాల కథలా ఉందని ఆ అధికారి అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' అనే దాన్ని విజయవంతం చేయాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరం అవుతుందని, దీర్ఘ కాలం తీసుకుంటుందని, అప్పటికప్పుడు తయారయ్యేది కాదన్న సత్యాన్ని వెల్లడించడానికి సంబంధిత అధికారులు వెనకాడుతున్నారని తెలిపారు. 'ఆత్మనిర్భర భారత్'ను అమలు చేసి, ఫలితాలు రాబట్టాలంటే ఇది సరళంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. అమెరికా, ఐరోపా దేశాల్లో పశ్చిమ దేశాలు తయారు చేసే హెలికాప్టర్లతో పోటీ పడాలంటే, ఎగిరేటప్పుడు హెలికాప్టర్ల భద్రత అనేది ప్రాథమికమైన లక్షణం. ఈక్విడార్ ఇవేమీ చూడకుండా ఒక నమ్మకంతో కొనడంతో ఇప్పుడు హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్తో ఒప్పందాలు చేసుకోవడానికి తడబడుతోంది. గాంధీ నగర్లో గత అక్టోబర్లో జరిగిన డెఫ్ఎక్స్పో 2022 లో హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ చీఫ్ సి.బి. అనంతకృష్ణన్ మాట్లాడుతూ అడ్వాన్స్డు లైట్ హెలికాప్టర్కు అపారమైన ఎగుమతి అవకాశాలున్నాయనడం గమనార్హం. "భారత రక్షణ పరికరాలు, హెలికాప్టర్లను ఎగుమతి చేయాలని భారత ప్రభుత్వానికి ఎంతో ఉన్నతాశయం ఉన్నప్పటికీ, అడ్వాన్స్డు లైట్ హెలికాప్టర్ల సామర్థ్యం పైన వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనవలసిన అవసరం ఎంతైనా ఉంది" అని ఒక సీనియర్ పారిశ్రామికాధికారి అన్నారు. అడ్వాన్స్డు లైట్ హెలికాప్టర్ల ఎగుమతుల్లో విజయాలు సాధించడానికి ముందు విశ్వసనీయత సాధించాలని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆ అధికారి హితవు పలికారు.

## షార్ట్ సర్క్యూట్స్ స్కూల్ బస్సు దగ్ధం

అవనిగడ్డ :ఎన్టీఆర్ జిల్లా కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో శనివారం ఉదయం రేపల్లెకు చెందిన శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన స్కూల్ బస్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి అయింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం 7 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు సమాచారం . ఉదయం డ్రైవర్ బస్సు స్టార్ట్ చేసే సమయానికి ఒక్కసారిగా మంటలు రావడంతో డ్రైవర్ బస్సులోంచి దిగి వేసి ప్రాణాలు రక్షించుకున్నాడు. ఆ సమయంలో స్కూల్ బస్సులో విద్యార్థులు ఎవరు కూడా లేరు. హుటాహుటిన అవనిగడ్డ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పి ప్రయత్నాలు చేశారు. అప్పటికే బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. సంఘటన ప్రాంతాన్ని స్థానిక రెవిన్యూ అధికారులు పరిశీలించారు

## తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీ పట్టిన తొలిమహిళ మల్లు స్వరాజ్యం

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, స్వాతంత్ర సమరయోధురాలు మల్లు స్వరాజ్యం.. ప్రస్తుత సూర్యాపేట జిల్లాలోని కర్విరాల కొత్తగూడెంలో ఓ భూస్వామ్య కుటుంబంలో 1931లో మల్లుస్వరాజ్యం జన్మించారు. వీరికి వందలాది ఎకరాల భూమి కలదు వీరిది భూస్వామ్య కుటుంబం. ఐదో తరగతి వరకే చదువుకున్న ఆమె.. తన సోదరుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి అడుగుజాడల్లో పోరాట పంథాలోకి వచ్చారు. 1945-48 మధ్య మహోజ్వలంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీ చేతబట్టి ఎందరో మహిళలకు ప్రేరణగా నిలిచారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజల్ని కదిలించేలా సభలు నిర్వహించేవారు. ఆనాటి రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా బతుకమ్మ పాటలతో ఉద్రూతలూగించే ఉపన్యాసాలతో మహిళల్ని చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె నైజాం సర్కార్కి వ్యతిరేకంగా పోరాడారు. దొరల దురహంకారంపై తన పాటలతో ప్రజలను చైతన్యపరిచారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో స్వరాజ్యం పనిచేశారు. సాయుధ పోరాటంలో తుపాకీ పట్టిన తొలిమహిళగా స్వరాజ్యం పేరుతెచ్చుకున్నారు. మహిళా కమాండర్గా పనిచేశారు. ఆమెను పట్టించిన వారికి నైజాం సర్కార్ పదివేల రివార్డు కూడా ప్రకటించింది. సాయుధ పోరాట కాలంలో మల్లు స్వరాజ్యంతో పాటు మూడువందల మంది మహిళలు మేజర్ జైపాల్ సింగ్ ఆధ్వర్యంలో సాయుధ శిక్షణ పొందారు. 75 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ, ప్రజాప్రస్థానంలో ఆమె రెండు సార్లు (1978, 1983లలో) తుంగతుర్తి శాసనసభ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడ పార్లమెంటుకు పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన మద్యపాన వ్యతిరేక పోరాటంలో మల్లు స్వరాజ్యం ప్రముఖ పాత్ర పోషించారు. అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలిగా అనేక మహిళా సమస్యలపై పోరాటాలు చేశారు. మల్లు స్వరాజ్యం భర్త మల్లు వెంకట నర్సింహారెడ్డి (వీఎన్ ) ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నల్లగొండ జిల్లా సీపీఎం కార్యదర్శిగా పనిచేశారు. ఆయన2004 డిసెంబర్ 4న మరణించారు. వీరికి ఒక కుమార్తె పాదూరి కరుణ, ఇద్దరు కుమారులు మల్లు గౌతంరెడ్డి (వైద్యుడు), మల్లు నాగార్జున రెడ్డి (న్యాయవాది) ఉన్నారు. కుమార్తె భాజపాలో ఉండగా.. చిన్న కుమారుడు నాగార్జున రెడ్డి సూర్యాపేట జిల్లా సీపీఎం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆమె ఆత్మకథ నా మాటే తుపాకీ తూటా (నా మాట ఒక బుల్లెట్) హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 2019లో ప్రచురించింది. స్వరాజ్యం తన 91వ ఏట 19 మార్చి 2022న హైదరాబాద్లో బహుళ అవయవ వైఫల్యంతో మరణించింది. ఆమె శరీరం వైద్య పరిశోధన కోసం నల్గొండలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు దానం చేయబడింది.

# అవినాష్ కు దారేటు...?

కడప, మార్చి 18,:కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి దారులు మూసుకు పోయాయి. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన అరెస్టు ఇక అనివార్యం అన్న భావనే సర్వత్రా వ్యక్తమౌతోంది. వైఎస్ వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎంపీ వివేకానందరెడ్డికి తెలంగాణ హై కోర్టులో చుక్కెదురైంది. సీబీఐ విచారణకు సంబంధించి ఆయన హైకోర్టులో దాఖలు చేసిన రెండు పిటిషన్లనూ కోర్టు కొట్టేసింది. కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అరెస్టు చేయకుండా ఆదేశించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆ మేరకు సీబీఐను ఆదేశించలేమని స్పష్టం చేసింది. సీబీఐ చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలనీ, విచారణపై స్టే ఇవ్వాలనీ అవినాష్ రెడ్డి కోర్టును ఆశ్రయించిన సంగతి విదితమే. అయితే ఆ రెండు అంశాలలోనూ కూడా కోర్టులో



అవినాష్ కు ఎలాంటి ఊరటా లభించలేదు. విచారణ సందర్భంగా న్యాయవాది హాజరుకు అనుమతించినా, విచారణలో ఎటువంటి జోక్యం కలుగ జేసుకోకూడదని స్పష్టంగా కోర్టు ఆదేశించింది. దీంతో ఈ కేసులో అరెస్టు కాకుండా అవినాష్ రెడ్డికి ఉన్న దారులన్నీ మూసుకు పోయినట్లేనని న్యాయనిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దీంతో ఇప్పటి వరకూ నాలుగు సార్లు సీబీఐ విచారణను ఎదుర్కొన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఐదోసారి కూడా విచారణకు హాజరు కాకతప్పని పరిస్థితి ఏర్పడింది. గతంలో సీబీఐ విచారణకు అవినాష్ రెడ్డి హాజరైన ప్రతి సారీ ఆయన అరెస్టు తప్పదన్న ప్రచారం జరిగింది. ఇప్పుడు కోర్టులో అవినాష్ రెడ్డికి చుక్కెదురైన నేపథ్యంలో ఆయన అరెస్టుకు ఇక ఎలాంటి అడ్డంకులూ లేవన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది నెక్స్ట్ ఏంటీ

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దూకుడు పెంచనుంది. ఈ కేసులో ఇప్పటికే ఎంపీ అవినాష్ రెడ్డిని నాలుగు సార్లు విచారించింది. మరోవైపు సీబీఐ విచారణను వ్యతిరేకిస్తూ .. హైకోర్టులో పిటిషన్ చేశారు అవినాష్రెడ్డి. సీబీఐ విచారణపై స్టే ఇవ్వటంతో పాటు మూడు అంశాలు ప్రస్తావిస్తూ హైకోర్టులో వాదనలు వినిపించారు. ఇందులో రెండింటిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. సీబీఐ తన విచారణను యథావిధిగా కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలన్న అవినాష్ పిటిషన్ను తోసిపుచ్చింది. అరెస్టు విషయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. విచారణ జరిపే సమయంలో ఆడియో, వీడియో రికార్డింగ్ తప్పనిసరని ఆదేశాలు జారీ చేసింది. విచారణ జరుగుతున్న తీరు న్యాయవాదికి కనిపించేలా అనుమతించాలని పేర్కొంది. హైకోర్టు తీర్పు తర్వాత సీబీఐ ఎలా వ్యవహరిస్తుందన్నది కీలకంగా మారింది. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న అవినాష్ రెడ్డికి నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. అయితే హైకోర్టు తీర్పుపై అప్పీల్ కు అవినాష్రెడ్డి అప్పీల్కు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం దస్తగిరి ఇచ్చిన స్టేట్మెంట్ల ఆధారంగానే సీబీఐ విచారిస్తోందని.. ఈ కేసుతో తనకుఎలాంటి సంబంధం లేదని అవినాష్ రెడ్డి చెబుతున్నారు. తనను ఎలాగైనా ఈ కేసులో ఇరికించాలని భావిస్తోందన్నది ఆయన వాదన. మరి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ నెక్స్ట్ స్టెప్ ఏంటి? అవినాష్ రెడ్డికి సీఆర్పీసీ 41 కింద నోటీసులు ఇస్తుందా? విచారణపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంపై అవినాష్ రెడ్డి అప్పీల్కు వెళ్తారా? మొత్తానికి ఈ కేసులో అటు సీబీఐ, ఇటు అవినాష్రెడ్డి ఎలా వ్యవహరిస్తారన్నది ఉత్కంఠను రేపుతోంది.

# జూలై నుంచి ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్

ఏలూరు, మార్చి 18, :పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని ఈ ఏడాది జులైలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డ్యామ్ డిజైన్ రివ్యూ కమిటీ తాజా డిజైన్లకు అమోద ముద్ర వేసినట్లు తెలుస్తోంది. దీంతో జులైలో పనులు ప్రారంభించేందుకు సిద్దమవుతున్నారు. డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో వరుసగా రెండు సీజన్లలో పనులు నిలిచిపోయాయి. మరోవైపు గోదావరి వరద ప్రవాహంతో కోతకు గురైన ప్రాంతాన్ని ఇసుకతో నింపే పనులు పూర్తి చేసే పనులు ప్రారంభించనున్నారు. డయాఫ్రం వాల్ నిర్మించిన ప్రాంతంలో పెద్దఎత్తున అగాథాలు ఏర్పడటంతో వాటిలో ఇసుక నింపి దానిని వైబ్రో కాంపషన్ పద్ధతిలో గట్టి పరిచే పనులు చేపట్టనున్నారు. గోదావరి వరదల్లో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిన చోట పెద్ద ఎత్తున ఏర్పడిన అగాథాలను వేగంగా పూడ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ నిపుణులు డయాఫ్రం వాల్ సామర్థ్యంపై ఇప్పటికే నివేదిక సమర్పించడంతో దానికి అనుగుణంగా పనులు చేపట్టనున్నారు. 1400మీటర్ల పొడవున నిర్మించిన డయాఫ్రం వాల్లో దాదాపు 700మీటర్ల పొడవున వేర్వేరు ప్రాంతాల్లో దెబ్బతింది. వీటిని సరిచేయాల్సి ఉందని గుర్తించారు. రెండు భాగాలుగా డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో వాటిని సరిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాల్లో డి వాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. కోతకు గురైన రెండు భాగాల్లో డయాఫ్రం వాల్కు సమాంతరంగా డి వాల్ నిర్మాణం చేపడతారు. డయాఫ్రం వాల్ మరమ్మతులు సాగుతున్న సమయంలో ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. దీంతో భారీ వరదలు వచ్చినా ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అంచనా వేస్తున్నారు. గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లిస్తే మట్టి కట్ట నిర్మాణానికి ఎలాంటి అటంకాలు ఉండవని అంచనా వేస్తున్నారు. జూన్ నుంచి గోదావరిలో వరద ప్రవాహం మొదలైన పనులకు ఎలాంటి అటంకం ఉండదని భావిస్తున్నారు. అన్ని అనుకూలిస్తే జులైలో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ప్రారంభం కానున్నాయి. డయాఫ్రం వాల్ నిర్మాణం జరిగిన గ్యాప్ వన్ ప్రాంతంలో ఈ పనులు చేపడతారు. ప్రస్తుతం పోలవరంలో నిర్మాణ పనులను చేపట్టడానికి ఎలాంటి ఇబ్బందులు లేనందున పనుల్ని నిరంతరం కొనసాగించవచ్చని భావిస్తున్నారు. కాఫర్ డ్యామ్లు ఉండటంతో మట్టికట్టను నిరంతరాయంగా నిర్మించవచ్చని చెబుతున్నారు. భారీ ఎత్తున వరద ప్రవాహం వచ్చిన కాఫర్ డ్యామ్ల మధ్య ఉన్న నీటిని తొలగించడం పెద్ద ఇబ్బంది కాదని పోలవరం అధికారులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున వరద ప్రవాహం వచ్చినా దాని ప్రభావం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని భావిస్తున్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్తో పాటు డయాఫ్రం వాల్ మరమ్మతులు సమాంతరంగా చేపట్టనున్నారు. పోలవరం ఆనకట్ట నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారనే నిర్దిష్ట గడువేది లేకపోయినా 2024లోపు గ్రావిటీ మీద నీళ్లు అందించాలనే లక్ష్యం మాత్రం విధించుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు ఏడాది కావడంతో వీలైనంత త్వరగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మట్టికట్ట నిర్మాణం జరిగే గ్యాప్1లో పనుల్ని జులైలో ప్రారంభించనున్నట్లు పోలవరం ఎస్ఈ నరసింహమూర్తి తెలిపారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఏకకాలంలో అన్ని పనులు చేపట్టేందుకు అనువైన వాతావరణం ప్రస్తుతం పోలవరంలో ఉందని చెబుతున్నారు.

# డైరెక్ట్ ఓటిటిలో రవిబాబు నుంచి లేటెస్ట్ థ్రిల్లర్.!




ఇప్పుడు టాలీవుడ్ సినిమా దగ్గర గాని తమిళ్ సినిమాలో గాని ఇప్పుడు వస్తున్న క్రైమ్ థ్రిల్లర్స్ ఏమో గాని కొన్నాళ్ల కితం మన టాలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు మరియు నటుడు అయినటువంటి రవిబాబు తెరకెక్కించిన అనసూయ, అమరావతి లాంటి థ్రిల్లర్స్ ఆడియెన్స్ లో స్పెషల్ ప్లేస్ ని సొంతం చేసుకున్నాయి. థ్రిల్లర్, కామెడీ అలాగే హారర్ బ్యాక్ డ్రాప్ లో తాను చేసే సినిమాలు యూనిక్ గా టచ్ చేస్తూ ఉంటాడు. మరి అలా చాలా కాలం తర్వాత అయితే తాను చేసిన లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం "అసలు". రవిబాబు ఆల్రెడీ చేసిన అవును 1, 2 అలాగే లడ్డు బాబు సినిమాలో హీరోయిన్ పూర్ణ ఈ సినిమాలో నటించింది. మరి ఈ చిత్రం అయితే డైరెక్ట్ ఓటిటి లో రిలీజ్ కానున్నట్టుగా ఇప్పుడు ఫిక్స్ అయ్యింది. అయితే ఈ సినిమాని 'ఈటీవీ విన్' ఓటిటి యాప్ వారు స్ట్రీమింగ్ కి తీసుకురానున్నారు. అలాగే ఈ చిత్రం అయితే ఈ ఏప్రిల్ 5 నుంచి అధికారికంగా ఇందులో రిలీజ్ కానుంది.

# సలార్ తర్వాత శృతి రేంజ్ మారుతుందా..!

కమల్ గారాల పట్టి శృతి హాసన్ ముందు తనకు మ్యూజిక్ మీద స్పెషల్ ఇంట్రెస్ట్ ఉండటంతో మ్యూజిక్ డైరెక్టర్ గా ప్రయత్నించాలని అనుకుంది కానీ అలా వర్క్ అవుట్ కాలేదు ఇక హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి చాలా రోజుల పాటు స్ట్రగుల్ అయ్యింది. గబ్బర్ సింగ్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న శృతి హాసన్ అప్పటి నుంచి వెనక్కి తగ్గలేదు. తెలుగు తమిళ సినిమాల్లో నటిస్తూ వస్తున్న శృతి హాసన్ కొన్ని కారణాల వల్ల టాలీవుడ్ కి దూరమైంది. అయితే మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చి వరుస సినిమాలు చేస్తుంది. శృతి హాసన్ ఈ ఏడాది తెలుగులో సూపర్ ఫాంలో ఉంది.సంక్రాంతికి వచ్చిన వీర సింహా రెడ్డి వాల్తేరు వీరయ్య రెండు సినిమాల్లో ఆమె నటించింది. ఆ రెండు హిట్లు కొట్టడంతో శృతి డిమాండ్ మరింత పెరిగింది. ఇక మరోపక్క ప్రభాస్ సలార్ లో కూడా అమ్మడు నటిస్తుంది. సలార్ తర్వాత ది ఐ అనే ఇంగ్లీష్ సినిమాకు సైన్ చేసింది శృతి హాసన్. తెలుగులో సీనియర్ హీరోల సినిమాలకు ఓకే చెప్పడంతో శృతి హాసన్ మళ్లీ రేసులో నిలిచింది. సలార్ తర్వాత శృతి హాసన్ టాలీవుడ్ లో వరుస క్రేజీ ఆఫర్లు అందుకోవడం పక్కా అని అంటున్నారు.శృతి కూడా తనకు ఆఫర్లు వస్తున్న టాలీవుడ్ మీద ప్రస్తుతం ఫోకస్ చేస్తుంది. కెరీర్ పరంగా టాలీవుడ్ లో గ్యాప్ వచ్చినా అది కూడా అమ్మడికి మంచే చేసిందని చెప్పొచ్చు. చిరు బాలయ్య లాంటి సీనియర్ హీరోలతో చేస్తే కెరీర్ రిస్క్ లో పడుతుంది అన్న లెక్కలేమి చూడకుండా వచ్చిన ప్రతి ఛాన్స్ చేసుకుంటూ వెళ్తుంది అమ్మడు. అందుకే తెలుగులో శృతి మళ్లీ ఫామ్ లోకి వచ్చింది.పవన్ తో



వకీల్ సాబ్ చిరుతో వాల్తేరు వీరయ్య బాలయ్యతో వీర సింహా రెడ్డి ఇలా మూడు భారీ సినిమాల్లో నటించడం వల్ల శృతికి తెలుగులో డిమాండ్ అలానే కొనసాగుతుందని అర్ధమవుతుంది. తెలుగుతో పాటుగా తమిళంలో కూడా సినిమాలు సైన్ చేస్తుంది శృతి హాసన్.

# ప్రభుదేవా నాటు సర్ప్రైజ్ పై చరణ్ ఇంట్రెస్టింగ్ పోస్ట్.!



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ఇపుడు తన లాస్ట్ సెన్సేషనల్ హిట్ సినిమా "రౌద్రం రణం రుధిరం" హిట్ అలాగే ఆ సినిమా నాటు నాటు సాంగ్ కి గాను ప్రఖ్యాత ఆస్కార్ అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా నిలిచింది. ఇక ఈ ఈవెంట్ తర్వాత సినిమా యూనిట్ అందరికీ గ్రాండ్ వెల్కమ్ అందుకున్నారు.మరి అలాగే గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కి కూడా హైదరాబాద్ ఢిల్లీ లలో గ్రాండ్ వెల్కమ్ అందించగా నిన్న అయితే చరణ్ కి తాను నెక్స్ట్ చేస్తున్న భారీ సినిమా నుంచి ఇండియన్ మైఖేల్ జాక్సన్ తమ సినిమాకి మళ్ళీ వస్తున్నందుకు గాను నాటు నాటు స్టెప్పేసి కంగ్రాట్స్ చెప్తూ స్వీట్ సర్ప్రైజ్ ని అందించారు. మరి శంకర్ సినిమా నుంచి ఈ గిఫ్ట్ చూసిన చరణ్ ఇంతటి మంచి వెల్కమ్ ని అందించినందుకు చాలా థాంక్స్ చెప్తున్నానని అలాగే మా గ్రాండ్ మాస్టర్ ప్రభుదేవా స్వీట్ సర్ప్రైజ్ కి కూడా థాంక్స్ చెప్తున్నానని ఇప్పుడు ఆర్సి 15 షూట్ లో మళ్ళీ జాయిన్ అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉందని తాను తెలిపాడు. దీనితో తన పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది.

# ధమ్కీ డైరెక్టర్ ను అందుకే తప్పించారట!



యువ నటుడు విశ్వక్ సేన్ ఒక పక్క సినిమాల్లో హీరోగా నటిస్తూనే... మరో పక్క దర్శకత్వం అవకాశం వస్తే ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఫలక్ నామ దాస్ సినిమాతో డైరెక్టర్ గా మారిన ఆయన ఇప్పుడు డైరెక్టర్ గా రెండో సినిమా చేస్తున్నారు. విశ్వక్ సేన్ దర్శకత్వం వహించిన దాస్ కా ధమ్కీ మార్చి 22 న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో ఎన్టీఆర్ పాల్గొనడంతో సినిమాపై ఉన్న హైప్ అంచనాలు వేరే లెవెల్ కి చేరుకున్నాయి. ఇక స్వయంగా ఈ సినిమాని వన్మయి క్రియేషన్స్ అని సొంత బ్యానర్ మీద నిర్మించడంతో ఈ సినిమా ప్రమోషన్స్ లో కూడా విశ్వక్ సేన్ దూసుకుపోతున్నాడు. విశ్వక్ సేన్ సినిమాను ప్రమోట్ చేయడానికి ఎటువంటి అవకాశం వచ్చినా వదిలిపెట్టడం లేదు.తాజా ఇంటర్వ్యూలో విశ్వక్ సేన్ ఇటీవలి రెండు వివాదాల గురించి ఓపెన్ కామెంట్స్ చేశారు. ఆ రెండు వివాదాలు ఏమిటంటే ముందుగా దాస్ కా ధమ్కీ సినిమాకి మరో దర్శకుడు లైన్ లోకి వచ్చారు కానీ మధ్యలో విశ్వక్ సేన్ సినిమాని హ్యాండ్ ఓవర్ చేసుకున్నారు. ఆ తర్వాత సీనియర్ హీరో అర్జున్ డైరెక్ట్ చేస్తున్న సినిమా నుంచి విశ్వక్ సేన్ ఎందుకు తప్పుకున్నారు? ఈ రెండు వివాదాల గురించి అడిగినప్పుడు విశ్వక్ చాలా మెచ్యూరిటీతో సమాధానం ఇచ్చారు.నరేష్ కొప్పిలిని ధమ్కీ దర్శకుడిగా తప్పించడం గురించి విశ్వక్ మాట్లాడుతూ... పాగల్ లో నరేష్ దర్శకత్వ నైపుణ్యం చూసిన తర్వాత అతను దాస్ కా ధమ్కీకి న్యాయం చేస్తాడని నాకు అనిపించింది. ఆయన దర్శకత్వంలో షూటింగ్ ప్రారంభించాము. కానీ పేపర్ మీద ఉన్న దాన్ని ఆయన ప్రజెంట్ చేసే విధానంలో కొంత తేడా కొట్టింది. అందుకే దర్శకుడిగా బాధ్యతలు స్వీకరించాను. ఇక మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవు. ఫ్యూచర్ లో ఆయన డైరెక్షన్లో కూడా నటిస్తానని చెప్పుకొచ్చారు. ఇక అర్జున్ సినిమా గురించి విశ్వక్ సేన్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఆ సినిమాలో పనిచేస్తున్న వారందరి మీద నాకు గౌరవం ఉంది. కాబట్టి ఎలాంటి కామెంట్స్ చేయాలనుకోవడం లేదని అన్నారు.

# బాబు మళ్ళీ కన్ఫ్యూజన్ లో పడేశాడుగా!




సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎస్ఎస్ఎంబి 28 మూవీ పై అందరిలో భారీ అంచనాలు నెలకొని ఉన్న సంగతి తెలిసిందే. అతడు ఖలేజా తర్వాత త్రివిక్రమ్ మహేష్ కాంబోలో వస్తున్న మూవీ కావడంతో హ్యాట్రిక్ హిట్ ఖాయం అని అంటున్నారు.తమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుంది. శ్రీలీల మరో హీరోయిన్ గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమా హారికా హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై సూర్యదేవర రాధాకృష్ణ ఈ మూవీని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రమ్యకృష్ణ జయరాం హైపర్ ఆది జగపతి బాబు ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్ లో జరుగుతుండగా పలువురు ముఖ్య నటులపై కీలక సన్నివేశాలను యూనిట్ చిత్రీకరిస్తోందని సమాచారం.ఇక ఈ సినిమా ఆగస్ట్ లో రిలీజ్ 11 న రిలీజ్ చేస్తారు అని ఈ సినిమా నిర్మాత నాగ వంశీ గతంలో ప్రకటించారు. కానీ తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం... ఈ మూవీ అనుకున్న తేదీకి రిలీజ్ కాదు అని తెలుస్తుంది. ఇప్పటికే ఈ సినిమా రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా మరోసారి వాయిదా పడుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా మహేష్ బాబు సినిమా రిలీజ్ డేట్ పై మేకర్స్ కన్ఫ్యూజన్లో ఉన్నారని తెలుస్తుంది.ఇక ఈ మూవీ టైటిల్ తో పాటు ఫస్ట్ లుక్ ని మార్చి 22న ఉగాది రోజున ప్రకటించనున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. అన్ని వర్గాల ఆడియన్స్ తో పాటు ముఖ్యంగా సూపర్ స్టార్ ఫ్యాన్స్ ని కూడా ఆకట్టుకునేలా భారీ యాక్షన్ తో కూడిన ఫ్యామిలీ కమర్షియల్ ఎంటర్టైనర్ గా త్రివిక్రమ్ దీనిని తెరకెక్కిస్తున్నారని తెలుస్తుంది. మహేష్ బాబు ఈ సినిమా తర్వాత దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేయనున్నాడు. ఈ సినిమా హాలీవుడ్ రేంజులో ఉంటుందని తెలుస్తోంది. మహేష్ త్రివిక్రమ్ సినిమా తర్వాతే రాజమౌళి సినిమా ప్రారంభం కానుంది. ఇందుకోసమే డొనాల్డ్ ట్రంప్ వచ్చే వారాంతంలో టెక్సాస్లో భారీ ర్యాలీ కోసం చేయాలని చూస్తున్నాడు. మరి ట్రంప్ ను అరెస్ట్ చేస్తారా? లేదా? అన్నది వేచిచూడాలి.

# వైజాగ్ లో "దసరా" యూనిట్..ప్రమోషన్స్ జరిగేనా?




నాచురల్ స్టార్ నాని హీరోగా కీర్తి సురేష్ హీరోయిన్ గా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కించిన సాలిడ్ మాస్ చిత్రం "దసరా". భారీ అంచనాలతో ఉన్న ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో అయితే రిలీజ్ కి సిద్ధంగా ఉండగా ప్రస్తుతం చిత్ర యూనిట్ అంతా అగ్రెసివ్ ప్రమోషన్స్ లో సిద్ధంగా ఉన్నారు. ఇక ఈ ప్రమోషన్స్ లో భాగంగా అయితే వారు ఇప్పుడు వైజాగ్ కి చేరుకున్నారు. మరి వైజాగ్ లో నేడు జరగనున్న భారత్ ఆస్ట్రేలియా మ్యాచ్ లో అయితే మేకర్స్ తమ ప్రమోషన్స్ ని మంచి ప్లాన్ తో చేసుకున్నారు.అయితే ఇప్పుడు ప్రమోషన్స్ వైజాగ్ లో అనుమానకరంగానే ఉన్నాయని చెప్పాలి. ఎందుకంటే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం పరిస్థితి సరిగ్గా లేదు పైగా ఈరోజు నుంచి విశాఖ లో మ్యాచ్ అటు ఇటు గానే అంటున్నారు. మరి మేకర్స్ అయితే ఈ ప్రమోషన్స్ ఎలా చేస్తారో చూడాలి. ఇక ఈ సినిమాకి సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు అలాగే ఎస్ ఎల్ వి సినిమాస్ వారు నిర్మాణం వహించారు. మార్చ్ 30న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కానుంది.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING
20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి
BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు
SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.
స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది
అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం
అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది
మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్
జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com